సాక్షి 24|7

గుంటూరు

ఆదివారం 20-8-2017



గాలి రమేష్, ఉమ దంపతులు (ఫైల్)

బతకలేమని.. చావే నయమని..

- వృద్ధ దంపతుల ఆత్మహత్య
- వృద్ధాప్యంలో మరొకరికి భారం కాకూడదనే..
- తెనాలి మండలం కంచర్లపాలెంలో విషాదం

ఒకరి ఆనందానికి మరొకరు చిరునవ్వయ్యారు.. ఒకరి కష్టానికి మరొకరు కన్నీరయ్యారు.. రత్నాల్లాంటి ఇద్దరు బిడ్డలు. కూతురు పెళ్లయి అత్తింటికి వెళ్లిపోయింది. ఇంతలో కొడుకును విధి చిదిమేసింది. ఆ దిగులు ఆమెను తియ్యని వ్యాధి రూపంలో కొద్దికొద్దిగా కబళించేస్తోంది. కొడుకు శాశ్వతంగా దూరమైనా.. కూతురు దూరంగా ఉన్నా.. భర్తే ఆమెకు కొండంత ధైర్యంగా నిలిచాడు. ఆరు పదుల వయసులోనూ నెత్తుటి చుక్కలతో ఆటో నడిపి బతుకు బండి లాగాడు. అయినా విధి మరోసారి వెంటాడింది. ఆమెకు వ్యాధి కాలు తీసేసే స్థాయికి చేరింది. ఇక ఈ కష్టాలు పడలేక.. మరొకరిపై భారం మోపలేక.. తనువు చాలించటమే దీనికి పరిష్కారమార్గంగా భావించారా దంపతులు. ఒక్కటై సాగించిన ప్రయాణాన్ని ఒక్కటిగానే ముగించారు. – తెనాలి రూరల్

మెయిన్‌లో..



వినువీధిలో విహరిద్దాం

4,54,749
గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి నాలుగేళ్లలో పెరిగిన విమాన ప్రయాణికులు

8,929
గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి నాలుగేళ్లలో పెరిగిన విమాన సర్వీసులు

2,300
నాలుగేళ్లలో పెరిగిన రోజువారి సగటు ప్రయాణికుల సంఖ్య

■ ఒకప్పుడు ధనికులకే పరిమితమైన విమాన ప్రయాణం... ప్రస్తుతం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కూడా అందుబాటులోకి వచ్చింది. విమాన టికెట్ల ధరలు నేలకు దిగివచ్చాయి. ప్రజల ఆదాయం పెరగడంతో ఒక్కసారి అయినా విమానం ఎక్కాలని ఎక్కువ మంది తహతహలాడుతున్నారు. ఫలితంగా విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. గన్నవరం విమానాశ్రయంలో కొత్తగా విమానం ఎక్కేవారి సంఖ్య నాలుగేళ్లలోనే 40 శాతానికి పెరగడమే ఇందుకు నిదర్శనం.

సెంటర్‌స్ప్రెడ్‌లో..

కాలేజీ బస్సును ఢీకొట్టిన ట్యాంకర్



2లో

మృత్యుంజయుడు చంద్రశేఖర్ జీజీహెచ్ నుంచి డిశ్చార్జి



2లో

నకిలీ పచ్చళ్ల గుట్టు రట్టు



19లో

మృత్యుంజయుడు చంద్రశేఖర్ జీజీహెచ్ నుంచి డిశ్చార్జి



చిన్నారి చంద్రశేఖర్‌కు ఆటబొమ్మ అందిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజునాయుడు తదితరులు



వైద్య బృందానికి వీడ్కోలు చెబుతున్న చిన్నారి చంద్రశేఖర్

నగరంపాలెం (గుంటూరు) : గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామంలో నాలుగు రోజుల క్రితం బోరుబావిలో పడి మృత్యుంజయుడిగా బయటపడిన చిన్నారి అనుమళ్ల మూడి చంద్రశేఖర్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు శనివారం డిశ్చార్జి చేశారు. బోరుబావిలో నుంచి బయటికి తీసుకొచ్చిన తర్వాత చికిత్స నిమిత్తం చిన్నారిని జీజీహెచ్‌కు తరలించిన విషయం తెలిసిందే. డిశ్చార్జి సందర్భంగా చిన్నారికి ఆటవస్తువులు అందించి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టరు డీఎస్ రాజునాయుడు అంబులెన్స్‌లో వారిని స్వగ్రామానికి పంపారు. మెరుగైన చికిత్స అందించి త్వరగా కోలుకునేందుకు సహకరించిన వైద్య బృందానికి చిన్నారి తండ్రి మల్లికార్జునరావు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డు స్టేడియంలో శనివారం జిల్లా అండర్–14, అండర్–17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక జరిగింది. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ చిరంజీవిరావు వివరాలు వెల్లడించారు. అండర్–17 బాలికల విభాగంలో కె.బ్యూలా, ఎం.దయామణి (ఎ.ఎం.జి– చిలకలూరిపేట), ఎస్.శ్రావ్య, కె.స్రవంతి (జెడ్పీ స్కూల్, లింగంగుంట్ల), అండర్–14 బాలికల విభాగంలో షేక్ సబిహా (లింగంగుంట్ల) షేక్ నసీమా (జెడ్పీ స్కూల్, పసుమర్రు), ఎ.ప్రవల్లిక (చార్లెస్ స్కూల్, చిలకలూరిపేట) కె.వెనిలా(పసుమర్రు), సి.హెచ్.అక్ష్య (తెనాలి) ఎంపికయ్యారు. బాలుర అండర్–17 విభాగంలో షేక్ సైదావలి (ఎస్.బి.ఆర్.స్కూల్, నరసరావుపేట), ఎ.ధీరజ్ (తెనాలి), బి.రవితేజరెడ్డి (గుంటూరు), సి.హెచ్.కౌషక్ (తెనాలి), ఎస్.యోగేష్‌కిషోర్ (గుంటూరు), అండర్ 14 బాలుర విభాగంలో జె.నితిన్‌కిరణ్ (గుంటూరు), షేక్ మునీర్ (రెపల్లె), బి.హర్షవర్ధన్‌రెడ్డి (గుంటూరు), జి.శ్రీవిష్ణు ప్రసాద్ (తెనాలి), ఎం.శివసాయిరెడ్డి (గుంటూరు) ఎంపికయ్యారన్నారు. తొలుత ఎంపికలను మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా ప్రారంభించారు. సహాయ కార్యదర్శులు ఎం.వి.సుబ్బారావు, పురుషోత్తం, సి.హెచ్.కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

కాలేజీ బస్సును ఢీకొట్టిన ట్యాంకర్

- రేపూడిలో సినీ ఫక్కీలో ప్రమాదం
- ఐదుగురు విద్యార్థులకు గాయాలు
- ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం
- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ప్రమాద స్థలంలో బస్సు, పక్కన ట్యాంకర్



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులు



ప్రమాదంలో గాయపడిన విద్యార్థినులు మేరి జోత్స్న, స్మయినా, ఆళ్ల శిరీష

ఫిరంగిపురం: సినీ ఫక్కీలో రహదారిపై మెలికలు తిరుగుతూ ఓ పెట్రోల్ ట్యాంకర్ వేగంగా కళాశాల బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని రేపూడి శివారులో కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై శనివారం జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం.. నరసరావుపేట శ్రీచైతన్య జూనియర్ కళాశాలకు చెందిన బస్సు ఫిరంగిపురం, వేములూరిపాడు, రేపూడి గ్రామాల నుంచి 15 మంది విద్యార్థినులతో శనివారం నరసరావుపేటకు బయల్దేరింది. రేపూడి శివారుకు చేరుకునే సమయానికి ఎదురుగా నరసరావుపేట నుంచి తాడేపల్లి వెళుతున్న పెట్రోలు ట్యాంకర్ సినీ ఫక్కీలో చక్కర్లు కొడుతూ ఎదురుగా వస్తోంది. బస్సు డ్రైవర్ వాసు, విద్యార్థినులు గుర్తించి పెద్దగా కేకలు వేస్తూనే ఉన్నారు. ఇంతలోనే ట్యాంకర్ బస్సును ఎదురుగా బలంగా ఢీకొట్టింది. ట్యాంకర్ అమాంతం వచ్చి బస్సు పక్కన ఆగింది. బస్సు ముందు అద్దాలు పగిలి పలువురిపై పడ్డాయి. మరికొందరు కిందపడి గాయాలపాలయ్యారు. ట్యాంకర్ డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి పరారయ్యాడు. అటుగా వస్తున్న వాహనదారులు ఘటన స్థలంలో ఆగి క్షతగాత్రులను బస్సు నుంచి దించారు.

ఐదు నిమిషాల వ్యవధిలోనే..

బస్సు బయలుదేరిన ఐదు నిమిషాల వ్యవధిలోనే ప్రమాదం జరగడం విశేషం. కొద్ది నిమిషాల్లోనే ప్రమాదం జరగడం, విద్యార్థినులు గాయపడటం అన్నీ జరిగిపోయాయి. వాహనదారులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని 108లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులను చూసిన విద్యార్థినులు కన్నీటి పర్యంతమయ్యారు. క్షతగాత్రులను పరామర్శించడానికి వచ్చిన తల్లిదండ్రులు, బంధువులతో ఆసుపత్రి ప్రాంగణం ఉద్విగ్నంగా మారింది. కేవలం ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ట్యాంకర్ అదుపుతప్పి వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టిందని చెప్పారు.

కేసు నమోదు...

తొలుత ఘటనపై ఎస్సై ఎం.ఆనందరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బస్సు, ట్యాంకర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిలిచిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గాయాలపాలైన విద్యార్థుల నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ప్రధానోపాధ్యాయులు టీం లీడర్లుగా వ్యవహరించాలి





మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి రఘుకుమార్, హాజరైన ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు

జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.రఘుకుమార్

గుంటూరు ఎడ్యుకేషన్:

ప్రభుత్వ పాఠశాలలను ప్రగతిపథంలో పయనింపజేయడంలో ప్రధానోపాధ్యాయులు టీం లీడర్లుగా వ్యవహరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రఘుకుమార్ సూచించారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో శనివారం గుంటూరు డివిజన్ పరిధిలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులందరూ సమష్టిగా పనిచేసినప్పుడే విద్యార్థుల సంఖ్య పెరిగి స్కూళ్లు అభివృద్ధి బాటపడతాయని అన్నారు. సుదీర్ఘంగా కొనసాగిన బదిలీల అనంతరం జిల్లా వ్యాప్తంగా అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు వేర్వేరు పాఠశాలలకు బదిలీలపై వెళ్లారని, కొత్త పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు వృత్తి బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. గుంటూరు నగరానికి చేరువలో ఉన్నా, దూరంగా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో పని చేసినా ఉపాధ్యాయులందరూ సమానులేనన్నారు. ప్రధానోపాధ్యాయుడు టీం లీడర్‌గా వ్యవహరించి ఉపాధ్యాయులను కలుపుకుని వెళ్లాలని సూచించారు. ఉపాధ్యాయులు నెలవారీ వేతన బిల్లులను ప్రతి నెలా ట్రెజరీకి సక్రమంగా పంపుతున్నదీ లేనిది పర్యవేక్షిస్తున్న విధంగా మధ్యాహ్న భోజనం బిల్లులు ట్రెజరీకి వెళ్లే విధంగా పర్యవేక్షించాలని సూచించారు. బదిలీల కారణంగా విద్యాబోధనపై దృష్టి సారించలేకపోయిన ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేయడంలో నిమగ్నం కావాలని సూచించారు. ఎంఈవోలు ప్రతి సోమవారం పాఠశాలలను తనిఖీలు చేయాలని ఆదేశించారు.

పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించండి..

రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ పయ్యావుల పార్వతి మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించాలని సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని గ్రంథాలయాల్లో ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో విజ్ఞానదాయక పుస్తకాలను కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డీవైఈవోలు పి.రమేష్, ముప్పాళ్ళ శంకరరావు, ప్రభుత్వ పరీక్షల విభాగ జిల్లా సహాయ కమిషనర్ మాణిక్యాంబ, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

విద్యతోనే అసమానతల తొలగింపు

ప్రభుత్వ గ్రంథాలయాల రాష్ట్ర సంచాలకురాలు పి.పార్వతి



తెనాలి అర్బన్: విద్యతోనే సమాజంలోని అసమానతలు తొలగిపోతాయని ప్రభుత్వ గ్రంథాలయాల రాష్ట్ర సంచాలకురాలు పార్వతి అన్నారు. తెనాలి, బాపట్ల ఎడ్యుకేషన్ డివిజన్ పరిధిలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో శనివారం కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో డీఈవో రఘుకుమార్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 9.45 నిమిషాల వరకు ఉపాధ్యాయులు, విద్యార్థులు పుస్తకాలు చదవాలన్నారు. ప్రతిరోజు పుస్తక పఠనం చేస్తామని ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రఘుకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బట్టిపట్టే విధానానికి స్వస్ పలకాలన్నారు. ఉపాధ్యాయులు విద్యారంగంలో ఉన్న సమస్యలను అధిగమించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కంఠంనేని శకుంతల మాట్లాడుతూ పుస్తకాలు తరగని సంపద అన్నారు.

కొండవీటి దొంగలు

ఇదేదో సినిమా టైటిల్.. భలే బాగుందే.. అనుకుంటున్నారా..?

'జగదేకవీరుడు అతిలోకసుందరి' సినిమాలో హీరో 'ఈ కొండవీటికి రాజసింహుడొక్కడే రారాజు రా..!' అని పాడాడు కదా..! ఆ బాపతే అనుకుంటున్నారా? 'గబ్బర్‌సింగ్'లో హీరో తాను విధులు నిర్వర్తిస్తున్న పోలీస్‌స్టేషన్ ఉండే ప్రాంతాన్ని 'కొండవీడు'గా చెప్పాడు కదా! ఇది కూడా అదే తరహాలో మరేదైనా సినిమా అనుకుంటున్నారా..? అయితే.. పప్పులో కాలేసినట్లే. ఇది టీడీపీ నాయకులు 'మట్టి' దొంగల అవతారమెత్తి కొత్తపాలెంలోని కొండవీటి కోట ప్రాకారాన్ని కొల్లగొడుతున్న రియల్ 'చిత్రం'!



పొక్లెయిన్లలో మట్టి తరలిస్తున్న దృశ్యం..

- కొండవీడు కోట ప్రాకారాన్ని తవ్వేస్తున్న టీడీపీ నాయకులు
- టిప్పర్ల కొద్దీ తవ్వి తరలించి దోచేస్తున్న వైనం
- ఇప్పటికే మూడొంతుల మట్టి హాంఫట్
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం
- ముడుపులు ముట్టడంతోనే కిమ్మనరని ఆరోపణలు

యడ్లపాడు(చిలకలూరిపేట):

చారిత్రక వైభవం కలిగిన కొండవీడు కోటను ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం పదేపదే గొప్పలు చెబుతోంది. రాజధాని ప్రాంతానికే తలమానికంగా తీర్చిదిద్దుతామని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కూడా ఆయన పాల్గొన్న ముఖ్యమైన సమావేశాల్లోనూ వల్లె వేస్తూఉంటారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా పనులు జరుగుతుంటాయి. టీడీపీ నాయకులు, మంత్రి అనుచరులు కూడబలుక్కొని కొండ చుట్టూ ఉన్న సహజ వనరులను దోచుకుంటూ ఉంటారు. ఇసుక, గ్రావెల్, మట్టి దోపిడీకి అడ్డూఅదుపూ ఏమీ ఉండదు. అయితే.. అదంతా టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్నదే. ఇప్పుడు అవన్నీ సరిపోక కొత్తపాలెంలోని కొండవీడు కోటకు రక్షణగా నిర్మించిన భారీ ఎర్రమట్టి కట్టనూ పొక్లెయిన్లతో తవ్వించి సొమ్ము చేసుకోవడం ప్రారంభించారు. అంతా మంత్రిగారి కనుసన్నల్లోనే జరుగుతున్నా కిమ్మనరు.

ఘన చరిత్రకు 'ప్రాకారం'..

1700 అడుగుల ఎత్తులో కొండవీడు ప్రకృతి అందాలకు ఆలవాలమై ఉంటుంది. ప్రాచీన కట్టడాలు, దేవాలయాలు, బురుజులు, విశాలమైన చెరువులతో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలంగా వర్ధిల్లుతోంది. కొండవీడు కోటకు రెండువైపులా సుమారు కిలోమీటరు పొడవునా ఎర్రమట్టితో 50 అడుగుల ఎత్తు, 200 అడుగుల వెడల్పుతో మట్టికట్టలా ఎత్తైన నిర్మాణం ఉండేది. శత్రు దుర్భేద్యంగా ఉండాలని 1325లో ప్రొలయ వేమారెడ్డి అనే రాజు అమరావతిలోని ధరణికోట నుంచి వేలాది మంది సైనికులతో మట్టి తెప్పించారు. ఈ మేరకు చారిత్రక ఆధారాలు కూడా ఉన్నాయి. నాడు రక్షణ కవచంగా ఉన్న మట్టికట్ట ఇప్పుడు టీడీపీ నాయకుల ధనదాహానికి కరిగిపోతోంది.

ఇప్పటికే కట్టను మూడొంతుల మేర తవ్వి సొమ్ము చేసుకున్నారు. ఇలాగే ఉంటే భావితరాలకు చూపించడానికి అక్కడ ఎలాంటి చారిత్రక ఆధారాలు మిగిలే అవకాశం లేకుండా చేసే పరిస్థితి నెలకొంది.

ఫిర్యాదులు పనిచేయవ్..!

సమస్యపై స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. పురావస్తు శాఖ అధికారులు, మైనింగ్‌శాఖ అధికారులకు దాని ఊసే పట్టదు. ఇక ఎవరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ప్రజలు కిమ్మనకుండా ఉంటున్నారు. అందాల్సిన వాళ్లకు ముడుపులు అందడంతోనే నెల రోజుల నుంచి పనులు చక్కగా అయిపోతున్నాయని స్థానికంగా చర్చలు కూడా సాగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చారిత్రక సంపదను కాపాడాల్సిన అవసరం ఉంది.

పోటీపడి.. వాటాలు పంచుకొని..

కొత్తపాలెంకు చెందిన టీడీపీ నాయకులు నెల రోజుల కిందట కట్ట తవ్వే పనులు ప్రారంభించారు. ముందుగా కొందరు గ్రూపుగా ఏర్పడి తవ్వకాలు ఆరంభించారు. ఇది చూసి మరో వర్గం మాకూ వాటా కావాలనడంతో ఇరువర్గాలు రాజీ మార్గానికి వచ్చారు. తర్వాత ఎవరికి వీలైనంత వారు తవ్వుకోవడం ప్రారంభించారు. ప్రాకారం హారతి కర్పూరంలా రోజురోజుకూ తరిగిపోతూనే ఉంది. తవ్విన మట్టి ఫిరంగిపురం, గుంటూరు తదితర ప్రాంతాలకు తరలుతూనే ఉంది.

లక్షల విలువైన మట్టి తరలింపు..

వెంచర్లు, రోడ్డు కాంట్రాక్టర్ల నుంచి ఆర్డర్లు వస్తే చాలు.. ఇక్కడి కట్ట నుంచి గ్రావెల్ తవ్వకాలు మొదలవుతాయి. వర్షాలు కురిసినపుడు, ఆర్డర్లు లేనప్పుడు తప్ప మిగిలిన సమయాల్లో యథేచ్ఛగా దందా సాగుతోంది. ఆర్డర్ అవసరాన్ని బట్టి రోజుకు 25 నుంచి 40 వరకూ ఎన్ని ట్రిప్పులైనా మట్టి తరలింపులు జరుగుతున్నాయి. ఒక్కో టిప్పర్‌కు రూ.2 వేల నుంచి రూ.2,500 చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలరోజుల్లో వందల సంఖ్యలో మట్టితరలించగా ఇప్పటివరకూ సుమారు రూ.15 లక్షల విలువైన మట్టి తరలించినట్లు తెలుస్తోంది.

మృత శిశువును చేతిలో పెట్టారు..!

- పిట్టలవానిపాలెం పీహెచ్‌సీ వద్ద శిశువు తల్లిదండ్రుల ఆందోళన
- ప్రసవానికి వస్తే వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపణ



ఆసుపత్రి ఎదుట బంధువులు (ఇన్‌సెట్‌లో) శిశువు మృతదేహం

పిట్టలవానిపాలెం: కాన్పు కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే కడుకోతను మిగిల్చారని చందోలు గ్రామానికి చెందిన సయ్యద్ జిలాని, మాలిన్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. పిట్టలవానిపాలెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రసవం కోసం వస్తే చనిపోయిన శిశువును చేతిలో పెట్టారని వాపోయారు. తెలిసిన వివరాల ప్రకారం.. పిట్టలవానిపాలెం మండలం చందోలుకు చెందిన సయ్యద్ జిలాని భార్య మాలిన్‌ను కాన్పునకు గాను ఈనెల 18న పిట్టలవానిపాలెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్చాడు. గైనకాలజిస్టు ఆమెను పరిశీలించి అంతా బాగానే ఉందని చెప్పారు. శనివారం ఉదయం నొప్పులు రావడంతో పరీక్షించి సాధారణ కాన్పు జరిగే అవకాశం ఉందని తేల్చారు. అవసరమైతే సిజేరియన్ చేసేందుకు అప్రమత్తంగా ఉన్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో నొప్పులు ఆగిపోవడంతో వైద్యాధికారిణి ఓ ఇంజెక్షన్ రాసి బయట తీసుకురావాలని గర్భిణి మాలిన్ బంధువులకు సూచించారు. ఇంజెక్షన్ చేసిన తర్వాత 1.30 సమయంలో సాధారణ కాన్పు జరిగింది. ఆమెకు మగశిశువు జన్మించాడు. శిశువు గుండె నెమ్మదిగా కొట్టుకుంటుందని వైద్యులు సూచించడంతో వెంటనే కుటుంబ సభ్యులు శిశువును చెరుకుపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే శిశువు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు వెంటనే సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతిచెందాడని ఆరోపించారు. శిశువును అప్పగించే సమయానికే తనలో కదలికలు లేవని బంధువులు చెప్పారు. అనంతరం పలువురు గ్రామపెద్దలు అక్కడికి వచ్చి వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రిలో ఐసీయూ సౌకర్యం లేకపోవడం వల్లే ప్రైవేట్ వైద్యశాలకు పంపించామని చెబుతుండటం గమనార్హం.

ప్రసవం తర్వాత శిశువు బాగానే ఉన్నాడు..

శిశువు జన్మించిన తర్వాత బాగానే ఉన్నాడు. గుండె చాలా నెమ్మదిగా కొట్టుకుంటుండటం గమనించి చిన్నపిల్లల వైద్యనిపుణుడికి చూపించాలని సూచించాం. ఇక్కడ ఉన్నంత వరకూ శిశువుకు ఆక్సిజన్ అందించాం. మార్గమధ్యంలో శిశువు మృతిచెంది ఉండొచ్చు.

– జరీనా, సామాజికి ఆరోగ్య కేంద్రం వైద్యురాలు

వ్యాక్సిన్ వికటించిందని తల్లిదండ్రుల ఆరోపణ

రేపల్లె రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం ఎంఆర్ వ్యాక్సినేషన్ జరిగింది. పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ఓ బాలుడికి వ్యాక్సిన్ వేయగా సాయంత్రం ఇంటికి వచ్చాక బాలుడి పెదవులు వాపెక్కాయి. తల్లిదండ్రులు ఆందోళనగా పాఠశాల యాజమాన్యం దగ్గరికి వెళ్లారు. బాలుడికి చిన్నప్పుడు గుండె జబ్బు ఉండేదని చెప్పారు. వైద్యుల వద్దకు తీసుకెళ్లగా వారు వ్యాక్సిన్‌కు, గుండె జబ్బుకు సంబంధం లేదని తేల్చారు. బాలుడిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా శనివారం వైద్యులు బాలుడిని పరీక్షించగా సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తేల్చినట్లు తెలిసింది.

'అంబేడ్కర్'తో చరిత్రలో ఒక పేజీ




మాట్లాడుతున్న దర్శకుడు దిలీప్‌రాజా

తెనాలిటౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆధారంగా 100 భాగాల ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయినట్లు కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు, దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. పెదరావూరులోని ఫిల్మ్ స్టూడియోలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దర్శకుడిగా తాను రూపొందిస్తున్న చిత్రానికి గుర్తింపుగా చరిత్రలో తనకు ఒక పేజీ ఉంటుందన్నారు. సోమవారం నుంచి 90వ ఎపిసోడ్ ప్రసారం అవుతుందన్నారు. 500 మందికి పైగా నటీనటులు, 100 మంది టెక్నిషియన్లు ఫిల్మ్‌కు పనిచేశారన్నారు. ఆయన వెంట నటుడు అన్వేష్‌కుమార్ రాజు, కొరియోగ్రాఫర్ సామ్రాట్, ప్రొడక్షన్ మేనేజర్ షేక్ షబ్బీర్ ఉన్నారు.

రవాణాశాఖ అధికారుల వాహన తనిఖీలు

నగరంపాలెం: నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆర్టీసీ హైర్, విద్యాసంస్థల బస్సులను శనివారం రవాణాశాఖ అధికారులు తనిఖీ చేసినట్లు జిల్లా ఉపరవాణా కమిషనర్ జీసీ రాజరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. 104 ఆర్టీసీ హైర్ బస్సులను తనిఖీ చేసి 20 కేసులు నమోదు చేశామన్నారు. ఒక బస్సు డ్రైవర్‌కు లైసెన్స్ లేదని, నాలుగు బస్సులకు సరైన పత్రాలు లేవన్నారు. మొత్తం ఐదు బస్సులను సీజ్ చేశామన్నారు. ఇప్పటివరకూ నిబంధనలకు విరుద్ధంగా 32 బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. శుభకార్యానికి స్కూలు బస్సు తీసుకెళుతుంగా ఓ బస్సును సీజ్ చేశామన్నారు. స్కూల్ బస్సుల నిర్వహణపై ఎలాంటి నిర్లక్ష్యం వహించినా యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.

రిపోర్టర్ల ఫోన్ నెంబర్లు : బాపట్ల - అంజయ్య : 95055 17849 ; బాపట్ల టౌన్ - కోటేశ్వరరావు : 96762 03348
కర్లపాలెం - ఏడుకొండల రెడ్డి : 98665 59513 ; పిట్టలవానిపాలెం - కోటి రెడ్డి : 93916 59196



మీ కోసం

కరెంటు బిల్లులు

పిట్టలవానిపాలెం గ్రామంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఆదివారం కరెంటు బిల్లులు చెల్లించవచ్చని ఏఈ పెరుగు శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంటు బిల్లులు చెల్లించవచ్చని సూచించారు.

ఆధ్యాత్మికం

మండలంలోని చందోలులో ఉన్న శ్రీబగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయం, ఖాజీపాలెంలోని కాశీవిశ్వనాథ స్వామి దేవాలయం,చందోలు శ్రీలింగోద్భవ క్షేత్రాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేస్తారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయి.

రేపు రుణ దరఖాస్తుదారుల అర్జీల పరిశీలన

బాపట్ల: పురపాలక సంఘంలో 2017-18వ ఆర్థిక సంవత్సరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీలకు సంబంధించి రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్నవారికి సోమవారం అర్జీల పరిశీలన ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు తెలిపారు. ఉదయం 11గంటలకు ఆన్‌లైన్ అర్జీల పరిశీలనతోపాటు స్క్రినింగ్ కమ్ సెలక్షన్ కమిటీ ఎంపిక ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

నేడు ఆనంద ఆదివారం

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆనంద ఆదివారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తోట మల్లీశ్వరీ, వైస్‌చైర్మన్ లేళ్ళ రాంబాబు పాల్గొంటారని తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ



బాపట్ల

నేనే రాజు నేనే మంత్రి	విజయకృష్ణ
లై	అన్నపూర్ణ
ఫిదా	అలంకార్
జయజానకీ నాయక	శ్రీనివాస

ఖాజీపాలెంలో..

జయజానకీ నాయక	విజయలక్ష్మి

కర్లపాలెంలో..

గౌతమీనంద	తిరుమల వెంకటేశ్వర

పిట్టవానిపాలెంలో...

జయజానకీ నాయక	వెంకట్రామా పిక్చర్ ప్యాలెస్

టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే రుణమేళా!

- అనుచరులకు మాత్రమే రుణాలు
- ఆందోళనలో ప్రజలు

పిట్టలవానిపాలెం:

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రుణమేళా అంతా టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే నడుస్తోంది. అనధికారికంగా ఏర్పడిన లోన్ మేళా కమిటీ వివక్ష ప్రదర్శిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కమిటీ ఏర్పాటుకు మండల పరిషత్ సమావేశంలో కనీసం తీర్మానం కూడా చేయలేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి జీవో కూడా విడుదల కాలేదు. రుణమేళా కార్యక్రమానికి ప్రతి కార్పొరేషన్ నుంచి ఒక ప్రతినిధి తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంది. అయితే ఇక్కడ అలాంటివేమీ జరగలేదు. లోన్ కమిటీ పేరుతో టీడీపీ నాయకుల కనుసన్నల్లో మేళా నిర్వహించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ప్రతిసారి రుణమేళాకు రావడం తిరిగి వెళ్లడం తప్ప మరేమీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రుణమేళా వద్ద కమిటీ సభ్యులు


రుణ మేళా నిర్వహణ వద్ద ఉన్న కమిటీ సభ్యులు

కమిటీ సభ్యులు వీరే

ఎంపీడీవో కాళవరప్రసాద్, ఎంపీపీ బివి సులోచన, జెడ్పీటీసీ చిరసాని నారపరెడ్డి, సంగుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు అన్నపూర్ణమ్మ, జీఎన్‌పాలెం ఎంపీటీసీ సుందర్ సింగ్, జీఎన్ పాలెం సర్పంచ్ శ్రీనివాసరావు, చందోలు సర్పంచి సుల్తానా బేగం పోతనకట్టవారిపాలెం సర్పంచి కృష్ణకుమారి, సామాజిక కార్యకర్తలు దీనబాబు, నరేంద్రకుమార్ కమిటీలో ఉన్నారు. జెడ్పీటీసీ సభ్యులు,కార్పొరేషన్ ప్రతినిధులు హాజరు కాలేదు.

ఆదినారాయణరెడ్డి ఎస్సీలకు క్షమాపణ చెప్పాలి

దళిత నాయకుల డిమాండ్

కర్లపాలెం: మంత్రి ఆదినారాయణరెడ్డి ఎస్సీల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య గౌరవ అధ్యక్షుడు మందపాటి పరమానందకుమార్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య, దళిత నాయకులు శనివారం కర్లపాలెంలో సమావేశం నిర్వహించారు. పరమానందకుమార్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలోని రిజర్వేషన్ వల్లనే మాల, మాదిగ కులస్తులెందరో బాగా చదువుకుని ఉన్నతస్థితికి ఎదిగారని మంత్రి ఈ విషయాన్ని మర్చిపోవద్దని హితవు పలికారు. మంత్రి ఆదినారాయణరెడ్డి ఎస్సీలకు క్షమాపణ చెప్పని పక్షంలో రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో దళిత నాయకులు మార్పు విలియం పాలపర్తి శ్రీనివాసరావు, యారం ఇసాక్, తాతపూడి మనోహర్, చుండూరు వీరయ్య ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య గౌరవ అధ్యక్షుడు పరమానంద కుమార్

డీలర్లు సమయపాలన పాటించాలి

తెనాలి డివిజన్ అసిస్టెంట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ కె.యలమంద సూచన

కర్లపాలెం: చౌక ధరల దుకాణాల్లో డీలర్లు సమయపాలన పాటించాలని తెనాలి డివిజన్ అసిస్టెంట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ కె.యలమంద తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రేషన్‌డీలర్ల సమావేశం జరిగింది. సమావేశంలో యలమంద మాట్లాడుతూ చౌక ధరల దుకాణంలో ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు సరుకులు విక్రయించాలని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు సరుకులు విక్రయించాలని ఆదేశించారు. అవకతవకలకు పాల్పడే డీలర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వి ప్రసాద్, ఆర్ఐ సాంబశివరావు, డీలర్లు ఉన్నారు.


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌వో కె.యలమంద

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

బాపట్ల టౌన్: సీనియర్ విద్యార్థులు నూతనంగా కళాశాలలో చేరిన జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని మోదుగుల శ్రీరామిరెడ్డి విద్యాసంస్థల అధినేత మోదుగుల బసవపున్నారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని మోదుగుల శ్రీరామిరెడ్డి డిగ్రీ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదుగుల బసవపున్నారెడ్డి మాట్లాడుతూ సీనియర్లు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయకుండా వాళ్లకు చదువు పట్ల వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసే గైడ్‌గా ఉండాలన్నారు. అదేవిధంగా విద్యార్థులు కష్టపడి చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. సత్యానందం, డీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కె. సునిల్, అధ్యాపకులు వై. రాజు, కరుణాకర్, తిరుమలరావు, శేఖర్, ప్రవీణ, రజిని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బసవపున్నారెడ్డి

వయోజనులకు నేడు అక్షరాస్యతా పరీక్షలు

కర్లపాలెం: నేషనల్ లిటరసీ మిషన్ అథారిటీ ఆధ్వర్యంలో ఎన్ఐఓఎస్ ద్వారా ఆదివారం వయోజనులకు అక్షరాస్యతా పరీక్షలు నిర్వహిస్తున్నామని వయోజన విద్య తెనాలి డివిజన్ సూపర్‌వైజర్ కె.మనోరంజన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వయోజన విద్య కరపత్రాలను ఆవిష్కరించారు. మనోరంజన్ మాట్లాడుతూ నూతన అక్షరాస్యులు, గత ఎన్ఐవోఎస్ పరీక్షలలో సి గ్రేడ్ వచ్చిన వారు, మధ్యలో బడి మానేసి 15ఏళ్లు దాటిన వయోజనులు ఈ పరీక్షలు రాయవచ్చునని తెలిపారు. పరీక్షలు రాయాలనుకునే వారు తమ పేర్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాని వయోజన విద్యా కేంద్రంలో గాని నమోదు చేయించుకోవాలని సూచించారు.


వయోజన విద్య కరపత్రాలు ఆవిష్కరించిన ఎంపీడీవో శరత్‌బాబు

రూ. 5 లక్షలతో మినీ ఇండోర్ స్టేడియం

మున్సిపల్ చైర్‌పర్సన్ తోట మల్లీశ్వరి



క్రీడా ప్రాంగణానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తోట మల్లీశ్వరి

బాపట్ల: పట్టణంలోని తాలింఖానాలో రూ. 5 లక్షలతో మిని ఇండోర్ స్టేడియాన్ని నిర్మిస్తు న్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తోట మల్లీశ్వరి తెలిపారు. శనివారం పట్టణంలోని శీలంవారి పాలెంలో మిని ఇండోర్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. తోట మల్లీశ్వరి మాట్లా డుతూ యువతకు చదువుతో పాటు క్రీడ ల్లోనూ రాణించేందుకు అవకాశం కల్పించాలనే సదుద్దేశంతో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ లేళ్ళ రాంబాబు, వార్డు కౌన్సిలర్ కొటికలపూడి రత్నకుమారి, తిరుమలశెట్టి రాజ్యలక్ష్మి, డీఈ సీతారామారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తానికొండ దయాబాబు, కొటికలపూడి సురేష్, చేజర్ల సతీష్ పాల్గొన్నారు.

మధురస్మృతుల సమాహారమే ఫొటోగ్రఫీ



ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్వస్ మాండే డాగురే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎస్‌ఐ సురేష్



నిరంజన్‌కు మెమోంటో అందజేస్తున్న ఎస్‌ఐ సురేష్

తాలుకా ఎస్‌ఐ సీహెచ్. సురేష్

బాపట్లటౌన్: మానవ జీవితంలో మధురస్మృతుల సమాహారమే ఫొటోగ్రఫీ అని తాలుకా ఎస్‌ఐ సీహెచ్. సురేష్ తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని పట్టణంలోని టౌన్‌హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ సీహెచ్. సురేష్ మాట్లా డుతూ మారుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఏ విధమైన అల్బమ్స్‌ను ప్రజలు ఇష్టపడుతున్నారో గుర్తించి వాటిని అందించే లా కృషి చేయాలన్నారు. ముందుగా పట్టణంలోని పురవీధుల్లో ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ జాక్వస్ మాండే డాగురే గొప్పత నాన్ని వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అమెరికా పురస్కార గ్రహీత పీవీఎస్ నాగరాజు, సీనియర్ ఫొటోగ్రాఫర్స్ కృష్ణమూర్తి, ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు గ్రహీత సంగాని ఏడుకొండలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రగతీ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. సుధాకర్, సెక్రటరి జయరావు, వైస్ ప్రెసిడెంట్ కె. ప్రసాద్, జాయింట్ సెక్రటరి కె. వెంకట్రావు, కోశాధికారి ఎస్. ఏడుకొండలు పాల్గొన్నారు.



తృతీయ బహుమతికి ఎంపికైన ఛాయాచిత్రం

నిరంజన్ ఛాయాచిత్రానికి తృతీయ బహుమతి

కర్లపాలెం: వరల్డ్ ఫోటోగ్రఫీ డే సందర్భంగా బాపట్ల నియోజకవ ర్గం స్థాయిలో శనివారం నిర్వహించిన ఛాయాచిత్రాల పోటీల్లో నిరంజన్‌కు తృతీయ బహుమతి లభించింది. బాపట్లలో జరిగిన చాయాచిత్రాల పోటీల్లో బాపట్ల ఎస్‌ఐ సురేష్ మెమోంటో, ప్రశం సాపత్రం అందజేశారని నిరంజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు సుధాకర్, ప్రసాద్, నాగేశ్వరరావు, కొండలు అభినందనలు తెలిపారు.

రెవెన్యూ సదస్సులకు 8 అర్జీలు

ఏట్రువారిపాలెం(కర్లపాలెం): భూసమస్యలు పరిష్క రించేందుకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఏట్రువారిపాలెం, పాతనందాయపాలెం గ్రామాల్లో శనివారం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు తప్పులు ఉంటే రైతులు అర్జీలు పెట్టుకోవాలని ఆయన కోరారు. అడంగల్, ఆన్‌లైన్ 1బి సవరణల కోసం రెవెన్యూ గ్రామసభలు ఉపయోగపడతాయన్నారు.

భవిష్యం

మేషం: పరిస్థితులు అనుకూలించవు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. భూవివాదాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొంత ఇబ్బందికరంగా ఉంటుంది. దూరప్రయాణాలు.

వృషభం: రాబడి ఆశాజనకమే. కొత్త వ్యక్తుల పరిచయం. శుభకార్యాలకు హాజరవుతారు. మీ అంచనాలు నిజమవుతాయి. బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. వ్యాపారాలు ఉద్యోగాలలో చికాకులు తొలగుతాయి.



మిథునం: ఆకస్మిక ప్రయాణాలు. కొత్తగా అప్పులు చేస్తారు. కష్టపడ్డా ఫలితం కనిపించదు. అనారోగ్య సూచనలు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళం.

కర్కాటకం: ఉద్యోగాలు, వ్యాపారాలు లక్ష్యాలు సాధిస్తారు. గృహ, వాహనయోగాలు. కుటుంబంలో నూతనోత్సాహం. కళాకారులకు అనుకోని అవకాశాలు. దేవాలయాల సందర్శనం.

సింహం: ఆదాయం అంతగా కనిపించదు. భూవివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సమస్యలు. వ్యాపార, ఉద్యోగాల్లో ఇబ్బందులెదురవుతాయి. అనుకోని ప్రయాణాలు.

కన్య: అందరిలోనూ గౌరవం. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. సోదరులతో విభేదాలు తొలగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ప్రోత్సాహకరం.

తుల: చిన్ననాటి స్నేహితులను కలుసుంటారు. భూములు, వాహనాలు కొంటారు. ఆశయాలు నెరవేరతాయి. వ్యాపార, ఉద్యోగులకు అనుకూల సమయం. విందు వినోదాలు.

వృశ్చికం: కుటుంబబాధ్యతలతో ఉక్కిరిబిక్కిరి. ఆస్తి వివాదాలు. సోదరులు, సోదరీలతో కలహాలు. అప్పులు చేస్తారు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరాశాజనకం.

ధనుస్సు: కుటుంబసమస్యలు వేధిస్తాయి. కష్టానికి తగ్గ ఫలితం కనిపించదు. ఆస్తి వ్యవహారాలలో చికాకులు. మానసిక ఆందోళన. వ్యాపారాలు, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితి. దేవాలయ దర్శనాలు.

మకరం: రావలసిన సొమ్ము అందుతుంది. వివాదాల నుంచి బయటపడతారు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. భవిష్యత్‌పై కొత్త ఆశలు. వ్యాపార, ఉద్యోగాల్లో చిక్కులు తొలగుతాయి.

కుంభం: కొత్త కార్యక్రమాలకు శ్రీకారం. శుభవర్తమానాలు. అదనపు రాబడి. కాంట్రాక్టులు పొందుతారు. జీవిత భాగస్వామి ద్వారా ఆస్తిలాభం. వ్యాపార, ఉద్యోగాల్లో నూతనోత్సాహం.

మీనం: దూరప్రయాణాలు. రాబడి కంటే ఖర్చులు అధికం. కార్యక్రమాలు నత్తనడకన సాగుతాయి. కృషి ఫలించదు. వ్యాపారాలు ముందుకు సాగవు. ఉద్యోగాలలో మార్పులు.

– సింహంభట్ల సుబ్బారావు

తిరుమల సమాచారం



తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండి, క్యూ వెలుపలకు వెళ్లింది.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం : గదుల వివరాలు:

ఉచిత గదులు	–ఖాళీ లేవు
రూ.50 గదులు	–ఖాళీ లేవు
రూ.100 గదులు	–ఖాళీ లేవు
రూ.500 గదులు	–ఖాళీ లేవు

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ	– ఖాళీ లేవు
వసంతోత్సవం	–ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవణ్ణ	–ఖాళీ లేవు

దుర్గగుడి సమాచారం



- తెల్లవారుజామున 3 గంటలకు ఆలయం తెరుస్తారు. అంనతరం అమ్మవారికి వస్త్రాలంకరణ సేవ చేస్తారు.
- 4 గంటలకు ఖడ్గమాల పూజ
- ఉదయం 6 గంటలకు యాగశాలలో నవగ్రహ హోమం
- ఉదయం 6, 10.45, 4.45 గంటలకు త్రికాలార్చన పూజలు
- 7 నుంచి 9 గంటల వరకు రుద్రహోమం
- 9 గంటలకు లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణం, చండీహోమం
- 11 గంటలకు సౌభాగ్య ప్రదాయినీపూజ
- మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన
- సాయంత్రం 4 గంటలకు స్వర్ణ పుష్పార్చన
- 6 గంటలకు పంచహారతులు
- రాత్రి 10 గంటలకు ఆలయం మూసివేత

– ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమం)

ఆర్టీసీ బస్సుల్లో సీట్ల ఖాళీలు



గుంటూరు నుంచి బెంగళూరు(లగ్జరీ) సాయంత్రం 6.00గంటలు.సీట్లు 04 ఖాళీ.
గుంటూరు నుంచి హైదరాబాద్‌కు (ఇంద్ర) రాత్రి 9.45 గంటలు. సీట్లు 26 ఖాళీ.
గుంటూరు నుంచి హైదరాబాద్‌కు (ఇంద్ర) రాత్రి 8.15 గంటలు.సీట్లు 08 ఖాళీ.
గుంటూరు నుంచి హైదరాబాద్‌కు. (గరుడ) రాత్రి 10.45 గంటలు. సీట్లు 19 ఖాళీ.
గుంటూరు నుంచి హైదరాబాద్‌కు (అమరావతి స్కానియా) రాత్రి 10.45 గంటలు .సీట్లు 14 ఖాళీ.
గుంటూరు నుంచి హైదరాబాద్‌కు (అమరావతి స్కానియా) రాత్రి 11.15 గంటలు. సీట్లు 16 ఖాళీ.
గుంటూరు నుంచి చెన్నై (లగ్జరీ) రాత్రి 8.30 గంటలు.సీట్లు 0 ఖాళీ.
గుంటూరు నుంచి విశాఖపట్నం (లగ్జరీ) రాత్రి 10.30 గంటలు.సీట్లు 21 ఖాళీ.
గుంటూరు నుంచి విశాఖపట్నం (లగ్జరీ) సాయంత్రం 6.45 గంటలు.సీట్లు 27 ఖాళీ.
గుంటూరు నుంచి తిరుపతి (లగ్జరీ) రాత్రి 9.45 గంటలు.సీట్లు 34 ఖాళీ.
గుంటూరు నుంచి తిరుపతి (లగ్జరీ) రాత్రి 9.45 గంటలు.సీట్లు 25 ఖాళీ.
గుంటూరు నుంచి తిరుపతి (లగ్జరీ) రాత్రి 10.15 గంటలు. సీట్లు 28 ఖాళీ.

–పాతగుంటూరు

విమాన వేళలు

గన్నవరం విమానాశ్రయం నుంచి విమానాలు బయలుదేరు వేళలు

న్యూఢిల్లీకి		
ఎయిరిండియా	09.05	ప్రతిరోజు
ఎయిరిండియా	17.20	ప్రతిరోజు
ఎయిరిండియా	20.40	ప్రతిరోజు
హైదరాబాద్‌కు		
స్పైస్‌జెట్	09.35	ప్రతిరోజు
ఎయిరిండియా	12.10	బుధవారం మాత్రమే
స్పైస్‌జెట్	14.40	బుధవారం మినహా
ఎయిరిండియా	17.20	ప్రతిరోజు
స్పైస్‌జెట్	17.35	ప్రతిరోజు
ట్రూజెట్	21.55	ప్రతిరోజు
బెంగళూరుకు		
స్పైస్‌జెట్	07.45	ప్రతిరోజు
స్పైస్‌జెట్	14.00	మంగళవారం మినహా
స్పైస్‌జెట్	20.10	ప్రతిరోజు
ఎయిరిండియా	15.50	గురు, శుక్ర, శని, ఆది
చెన్నైకు		
ట్రూజెట్	07.55	ప్రతిరోజు
స్పైస్‌జెట్	15.20	ప్రతిరోజు
స్పైస్‌జెట్	14.00	మంగళవారం మాత్రమే
విశాఖపట్నానికి		
ఎయిరిండియా	12.55	బుధవారం మినహా
ఎయిరిండియా	15.35	బుధవారం మాత్రమే
ఎయిరిండియా	19.25	గురు, శుక్ర, శని, ఆది
తిరుపతికి		
ఎయిరిండియా	09.55	బుధవారం మినహా అన్ని రోజులు

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్ : నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం శనివారం 500.30 అడుగుల వద్ద ఉంది. ఇది 115.7846 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 600, లాసెస్‌కు 265 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మొత్తం ఔట్‌ఫ్లో 865 క్యూసెక్కులు. శ్రీశైలం నుంచి సాగర్‌జలాశయంకు 865 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 780.50 అడుగుల వద్ద ఉంది. ఇది 20.5552 టీఎంసీలకు సమానం.

సాగునీటి సమాచారం

దుగ్గిరాల : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 4,513 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,410 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ కాల్వకు 962, తూర్పు కాల్వకు 396, పశ్చిమ కాల్వకు 201, నిజాంపట్నం కాలువకు 360, హై లెవల్ చానల్‌కు 160 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖాధికారులు తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి టౌన్ : తెనాలి మార్కెట్‌లో శనివారం టిక్కీ నిమ్మకాయల కనిష్ట ధర రూ.900, గరిష్ట ధర రూ.1500, మోడల్ ధర రూ.1150 పలికినట్లు వ్యాపారులు తెలిపారు.

కూరగాయల ధరలు



గుంటూరులోని ఎన్టీఆర్ రైతుబజారులో నిన్నటి ధరలు (రూ.)

టమాట	48	దోస	17
వంకాయ	30	సొర	8
బెండ	20	పొట్ల	14
మిర్చి	26	పెద్ద చిక్కుళ్ళు	34
కాకర	24	చామ	30
బీర	20	బీట్‌రూట్	25
క్యాబేజి	15	కీర	20
క్యారెట్	49	ఫ్రెంచిబీన్స్	60
దొండ	24	క్యాప్సికం	48
బంగాళదుంప	16	ములక్కాయ ఒకటి	7
ఉల్లిపాయలు	22	అల్లం	70
గోరుచిక్కుళ్ల	24		

– కొరిటెపాడు(గుంటూరు)

చికెన్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ రైతు ధర	94, 102, 113
చికెన్ విత్ స్కిన్	182
చికెన్ స్కిన్‌లెస్	192

కోడి గుడ్ల ధరలు (నెక్)

రైతు ధర - 3.59

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్, నికోబార్ దీవులు, పశ్చిమ తీరప్రాంతాలు, మధ్య మహారాష్ట్ర, పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు గుజరాత్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాయువ్య మైదానాలు, తూర్పు రాజస్థాన్, మధ్య, తూర్పు భారతదేశంలోని ఇతరప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

గుంటూరు వాతావరణం

గరిష్టం కనిష్టం
28.2°/24.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	29.6	26.0
కోల్‌కతా	32.7	27.2
బెంగళూరు	28.6	20.3
ముంబై	27.8	25.6
చెన్నై	34.3	24.6

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
నెల్లూరు	34.6/28.0	కర్నూలు	29.1/23.2
చిత్తూరు	34.4/26.2	నల్లగొండ	28.6/23.4
తిరుపతి	34.4/26.2	గుంటూరు	28.2/24.0
అనంతపురం	33.8/24.7	కాకినాడ	27.5/24.7
శ్రీకాకుళం	32.5/25.5	ఖమ్మం	27.0/19.4
విజయనగరం	32.5/25.5	కరీంనగర్	26.2/23.3
కడప	31.2/24.5	వరంగల్	26.1/24.0
ఒంగోలు	29.8/24.9	నిజామాబాద్	26.0/23.5
ఏలూరు	29.8/24.6	మహబూబ్‌నగర్	26.0/22.5
రాజమండ్రి	29.8/24.6	ఆదిలాబాద్	26.0/21.3
తాడేపల్లిగూడెం	29.8/24.6	హైదరాబాద్	25.7/21.9
విశాఖపట్నం	29.3/26.0	రంగారెడ్డి	25.7/21.1
విజయవాడ	29.1/24.1	మెదక్	25.4/21.5

బుల్లితెర

W

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30	సత్యవాక్యం
ఉ.07.00	న్యూస్ 360
ఉ.07.30	కేఎస్‌ఆర్ లైవ్ షో
ఉ.09.00	రీజనల్ న్యూస్
ఉ.09.30	జ్యాక్ బాక్స్
ఉ.10.00	సాక్షి న్యూస్
ఉ.10.30	భవిత
ఉ.11.30	సదరన్ స్పైస్
మ.02.30	కెరీర్ ప్లస్
సా.04.30	కొత్త ప్రపంచం
సా.05.00	స్పీడ్ న్యూస్
సా.05.30	జనపథం
రా.07.30	స్టార్ స్టార్ సూపర్ స్టార్
రా.08.00	మనసులో మాట
రా.09.00	న్యూస్ 360
రా.10.30	సదరన్ స్పైస్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 మాధవయ్యగారి మనవడు
ఉ.09.30 సరోజ
మ.12.00 మేడమ్
సా.06.00 విజయేంద్ర వర్మ
రా.09.00 లంకేశ్వరి



మూవీస్ నౌ
ఉ.08.30 సిండ్రెల్లా
ఉ.10.35 టాయ్ స్టోరీ
మ.03.05 బిగ్ హీరో 6
సా.07.15 మోడరన్ టైమ్స్
రా.09.00 యాంట్-మ్యాన్




హెచ్‌బీవో
ఉ.06.00 ఆల్మోస్ట్ హీరోస్
ఉ.09.49 కుంగ్‌ఫు పాండా
మ.01.21 13 అవర్స్
సా.06.17 ద డార్క్ నైట్
రా.09.00 పాన్



స్టార్ మూవీస్
ఉ.06.15 బ్యాటిల్ ఎర్త్
ఉ.09.45 ద ఇంక్రెడిబుల్స్
మ.01.57 మేజ్ రన్నర్
సా.04.36 హోమ్ అలోన్ 3
సా.06.51 కుంగ్‌ఫు హ్యాసిల్



మా మూవీస్
ఉ.07.00 బిగ్‌బాస్ మారథాన్
మ.12.00 రాజుగారి గది
మ.03.00 ప్రేమిస్తే
సా.05.00 యమదొంగ
రా.10.30 తీన్‌మార్



జీ సినిమా
ఉ.07.59 ఫైటర్ నం.1
ఉ.10.21 ఏ ఫ్లయింగ్ జాట్
మ.01.37 హమ్ ఆప్‌కే హై కౌన్
సా.06.05 ఎంటర్‌టైన్‌మెంట్
రా.09.00 సింగ్ ఈజ్ బ్లింగ్

ఫైర్ సిబ్బంది సేవలు అభినందనీయం

బోరుబావి ఘటనలో స్పందన భేష్



ఫైర్‌మెన్ మస్తాన్‌ను అభినందిస్తున్న సభాపతి కోడెల శివప్రసాద్, మంత్రి ప్రత్తిపాటి, పక్కన నన్నపనేని రాజకుమారి, కలెక్టర్ కోన శశిధర్

నరసరావుపేట ఈస్ట్: బోరుబావిలో చిన్నారిని కాపాడడంతో కీలక పాత్ర వహించిన నరసరావుపేట అగ్నిమాపక సిబ్బందికి పలువురి నుంచి ప్రశంసలు అందుతున్నాయి. సమాచారం అందిన వెంటనే హుటాహుటిన ఉమ్మడివరం చేరుకున్న ఫైర్ సిబ్బంది నిమిషాల వ్యవధిలోని సహాయ చర్యల్లో పాల్గొన్నారు. సీనియర్ ఫైర్‌మెన్ పి.కె. పాండురంగారావు చిన్నారికి ఆక్సిజన్ అందించడంలో కీలకపాత్ర వహించారు. కొద్ది రోజుల్లోనే ఉద్యోగ విరమణకు సిద్ధంగా ఉన్న ఆయన దాదాపు 10 గంటలపాటు ఆక్సిజన్ అందిస్తూనే ఉన్నారు. మరో ఫైర్‌మెన్ షేక్ మస్తాన్ సమాంతరంగా తవ్విన గోతిలోకి దిగి బోరు బావిలోని బాలుడికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చెక్కను అమర్చారు. మస్తాన్‌తోపాటు రూరల్ ఎస్పీ వెంకటప్పలనాయుడు గోతిలోకి దిగి తగిన సూచనలు అందించారు. నరనసరావుపేట ఫైర్ సిబ్బంది సేవలను గుర్తించిన జిల్లా యంత్రాంగం వారిని ఘనంగా సత్కరించింది. సభాపతి డా.కోడెల శివప్రసాదరావు, మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, కలెక్టర్ కోన శశిధర్, రూరల్ ఎస్పీ వెంకటప్పలనాయుడు తదితరులు నరసరావుపేట ఫైర్ సిబ్బందిని అభినందించారు.

కూచిపూడిలో రాధామాధవ రసరంజని విద్యార్థుల ప్రతిభ

పాత గుంటూరు: శ్రీలంకలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన కూచిపూడి అంతర్జాతీయ నృత్య పోటీల్లో గుంటూరుకు చెందిన రాధామాధవ రసరంజని విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో మెప్పించారు. కృష్ణతాండం నృత్య పోటీల్లో కూచిపూడి బృంద నాట్యానికి ప్రథమ, లంబాడి జానపద నృత్యానికి కన్సొలేషన్ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా సంస్థాపక కార్యదర్శి షేక్ ఖలీల్‌ను స్థానికులు అభినందించారు.



బహుమతులు పొందిన రసరంజని విద్యార్థులతో ఖలీల్

ఒంటికాలిపై నిరసన



ఒంటికాలుపై నిరసన తెలియచేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

బాపట్ల టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం 11వ రోజుకు చేరుకుంది. జీవో 64ను రద్దు చేయాలని కోరుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు. అధికారులు స్పందించే వరకు నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

విద్యార్థినులను లంచమడిగిన జీజీహెచ్ ఉద్యోగి?

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడి సిటిస్కాన్ పరీక్షల కోసం వచ్చిన శ్రీచైతన్య కళాశాల విద్యార్థినుల వద్ద డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. మొత్తం ఆరుగురు విద్యార్థినులకు సిటిస్కాన్ పరీక్షలు చేయాల్సి ఉండగా విధుల్లో ఉన్న సిటిస్కాన్ టెక్నీషియన్ కృష్ణ 10 వేల రూపాయలు డిమాండ్ చేసినట్లు కళాశాల సిబ్బంది ఫిర్యాదు చేశారు. తమ వద్ద వైద్య పరీక్షలు చేసేందుకు ఐదు వేల రూపాయలు తీసుకున్నారని ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేసి వారు ప్రైవేటు ఆస్పత్రికి వైద్యం కోసం విద్యార్థినులను తీసుకెళ్లారు. కృష్ణపై గతంలో కూడా పలు ఫిర్యాదులతోపాటు దొంగబంగారం కేసు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈవిషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవనబోయిన శౌరిరాజునాయుడును 'సాక్షి' వివరణ కోరగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే సదరు ఉద్యోగిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

దుగ్గిరాల : తాళం వేసిన ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ఘటనలో నిందితులను దుగ్గిరాల పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎస్ఐ మన్నం మురళి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. మండలంలోని చినపాలెం గ్రామ శివారులోని పెమ్మసాని గెస్ట్‌హౌస్‌లో ఈ నెల 16న జరిగిన దొంగతనం కేసుకు సంబంధించి గెస్ట్‌హౌస్ యజమాని పెమ్మసాని మురళీకృష్ణ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈకేసులో నిందితులుగా మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన ఈడే మహేష్, కె.నరేంద్రగోపి, అద్దంకి దుర్గాప్రసాద్, పాలేటి రోహిత్, కీర్తి కామేష్, షేక్ ఖాజావలీగా గుర్తించామన్నారు. షేక్ ఖాజావలి పరారీలో ఉన్నట్టు చెప్పారు. నిందితుల వద్ద నుంచి అపహరణకు గురైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

బ్యాంక్ ఉద్యోగులమంటూ ఘరానా మోసం

పెదకాకాని: బ్యాంకు ఉద్యోగుల మంటూ ఫోన్ చేసి అకౌంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుని రూ.94 వేలు డ్రా చేసుకుని ఘరానా మోసం చేసిన సంఘటన పెదకాకానిలో వెలుగుచూసింది.పెదకాకాని గ్రామానికి చెందిన ఎల్.రాజ్యం బ్యాంక్ అకౌంట్‌లో రూ.94 వేలు నగదు ఉంది. ఈనెల 9వ తేదీ గుర్తుతెలియని వ్యక్తులు ఆమెకు ఫోన్ చేసి బ్యాంక్ అకౌంట్‌లో అప్పుడప్పుడూ డబ్బులు వేస్తూ తీస్తూ ఉండాలని, లేదంటే సర్వీసు టాక్స్ పడుతుందని తెలియజేస్తూ తమను తాము బ్యాంకు అధికారులుగా పరిచయం చేసుకున్నారు. ఒకసారి బ్యాంకుకు రావాలంటూ ముందుగా అకౌంట్ నంబర్, ఆ తరువాత ఏటీఎం నంబర్ అడగడంతో ఆమె నిజంగా బ్యాంకు అధికారులుగా భావించి పూర్తి వివరాలు తెలియజేసింది. వారం రోజుల తరువాత బ్యాంకుకు వెళ్లి చూస్తే అకౌంట్‌లో ఉన్న రూ.94 వేలు డ్రా చేసి ఉన్నాయి. జరిగిన మోసం తెలుసుకుని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్లి ప్రేమయ్య తెలిపారు. ఇప్పటికే ఈ తరహాలో రెండు కేసులు పోలీసుస్టేషన్‌లో నమోదు కావడం విశేషం.

ఎమ్మార్ వ్యాక్సిన్‌తో ఎలాంటి ప్రమాదం ఉండదు

స్పష్టం చేసిన గుంటూరు ప్రభుత్వ వైద్యులు

తాడేపల్లి రూరల్(గుంటూరు) : గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ పరిధిలోని అంబేడ్కర్ కాలనీ (యానాదుల కాలనీ)లో శుక్రవారం బాలిక మృతికి ఎమ్మార్ వ్యాక్సిన్ కారణం కాదని గుంటూరు ప్రభుత్వ వైద్యులు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బాలిక మృతిచెందిందన్న విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా ఆరోగ్యశాఖ నుంచి నిపుణుల కమిటీ డాక్టర్ రమేష్, డీఐవో ఎం.సుహాసిని ఆ ప్రాంతాన్ని సందర్శించి ఆ పాప తల్లిదండ్రుల నుంచి సమాచారాన్ని సేకరించారు. ఎమ్మార్ వ్యాక్సిన్ వల్ల మృతిచెందలేదని అక్కడే నిర్ధారణ అయింది. అయినా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు తీసుకువచ్చి, వైద్యపరీక్షలు నిర్వహించి, అది ఎమ్మార్ వ్యాక్సిన్ వల్ల సంభవించిన మృతి కాదని నిర్ధారించినట్లు వైద్యులు వివరించారు. ఎమ్మార్ వ్యాక్సిన్‌కు రియాక్షన్ లేదని నిపుణుల కమిటీ సభ్యులు మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ దేవకుమార్, డాక్టర్ నాగేశ్వరరావు, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ టి.నీరద ఆ ప్రకటనలో తెలిపారు.

మల్లె గుండెల్లో గుబులు

మంగళగిరి : నియోజకవర్గంలోని మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో గల రాజధాని గ్రామాల్లో భూసమీకరణ ఎంత అవస్థలు పెట్టిందో ఇప్పుడు భూముల చదును అంతకంటే ఆందోళన కలిగిస్తూ ప్రాణాలు తీస్తోంది. మండలంలోని కురగల్లులో కౌలు భూములలోని మల్లె తోటలను అధికారులు తొలగిస్తే అప్పు ఎలా తీర్చాలోనని ఆందోళనతో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడనే విషయం తెలిసిన చుట్టుపక్కల రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు భయపడుతున్నారు. రాజధానికి తీసుకున్న భూములన్నింటిలో నిర్మాణాలు పూర్తయిన తర్వాతే పూలతోటలు తొలగిస్తామని అప్పట్లో మంత్రులు, అధికార పార్టీ నేతలు చెప్పారు. ఇప్పుడేమో వారానికోసారి తోటల దగ్గరకు పొక్లెయిన్లతో వచ్చి ఆందోళనకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. వాస్తవానికి మండలంలోని పూల తోటలు అధికంగా పండే నిడమర్రు, కురగల్లు, బేతపూడి గ్రామాలు తొలి నుంచి భూసమీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మూడు గ్రామాల్లో సుమారు 1600 ఎకరాలలో మల్లె తోటలు సాగవుతున్నాయి. నిడమర్రు గ్రామంలో ఇప్పటికీ 800 ఎకరాలకుపైగా సమీకరణకు ఇవ్వకుండా రైతులు సాగు చేస్తున్నారు. ఇక బేతపూడి, కురగల్లు గ్రామాల్లోనూ రెండు వందల ఎకరాలకుపైగా సమీకరణకు ఇవ్వని పూల తోటలున్నాయి.

- ప్రాణాలు తీస్తున్న రాజధాని భూసమీకరణ
- పొక్లెయిన్లతో వచ్చి పంటల తొలగింపునకు యత్నం
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రైతులు
- పదే పదే పంటపై దాడి
- ఆత్మహత్యలకు పాల్పడుతున్న అన్నదాతలు



తోటలను తొలగించేందుకు వచ్చిన పొక్లెయిన్లు



పూలను కోస్తున్న కూలీలు

అన్నీ కల్లబొల్లి మాటలే..

అయితే మంత్రులు, అధికార పార్టీ నేతలు, అధికారుల మాటలు విని కొందరు రైతులు సమీకరణకు ఇచ్చారు. అందులో సుమారు మూడు వందలకు ఎకరాలకుపైగా కౌలు రైతులు సాగు చేస్తున్నారు. మల్లెతోటకు ఏడాదికి రూ. లక్ష వంతున కౌలు చెల్లిస్తున్నారు. ఆయా మల్లె తోటలపై రైతు, కౌలు రైతు, కూలీలు వెరసి నాలుగు వేల మంది ఆధారపడి జీవిస్తున్నారు. మల్లె తోట ఒకసారి మొక్క నాటితే పది నుంచి పదిహేనేళ్ల వరకు సాగవుతుంది. ఈ నేపథ్యంలో కౌలు రైతులు దీర్ఘకాలం సాగు కోసం కౌలుకు తీసుకుని ఎకరాకు రూ. 2 లక్షలకుపైగా పెట్టుబడి పెడతారు. ఇప్పుడు అర్ధంతరంగా పూలతోటలను తొలగిస్తే ఎలా జీవిస్తామని ప్రశ్నిస్తున్నారు. దీంతో పూల తోటల తొలగింపును అడ్డుకుంటున్నారు. అనేక గ్రామాల్లోని భూముల్లో పిచ్చిమొక్కలు మొలిచి ఉన్నాయని, ముందుగా వాటిని తొలగించాలని రైతులు సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్లను కలిసి విన్నవించారు. అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా వచ్చి తోటలను తొలగించేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏం పని చేసుకోవాలి



మాకు వ్యవసాయం తప్ప మరో పని రాదు. రాజధానికి భూములు తీసుకునే సమయంలో పింఛన్లు ఇస్తామని, పూలతోటలు జోలికి అప్పుడే రాబోమని హామీలిచ్చారు. ఇప్పుడు అర్ధంతరంగా తోటలను తొలగిస్తే ఎలా బతకాలి. మాకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే తోటల్లోకి రావాలి. బలవంతగా తోటలను తొలగిస్తే ఆత్మహత్యలే శరణ్యం.

– కె. మల్లేశ్వరి, కూలీ

పంటలు చదును చేస్తే ఊరుకోం



రాజధాని పేరుతో తీసుకున్న భూములన్నీ ఖాళీగా ఉండడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. తీసుకున్న భూములన్నింటిలో ఎంత వరకు నిర్మించారు. తమ నోటికాడ ముద్దను లాగాల్సిన అగత్యమేమిటి. పూలతోటలలో వచ్చే కూలీతోనే ఎన్నో కుటుంబాలు బుతుకుతున్నాయి. పూలతోటలను ధ్వంసం చేసేందుకు అంగీకరించే ప్రసక్తే లేదు.

– కె. గోపమ్మ, కూలీ

ఆంధ్రుల సమగ్ర చరిత్రకు గ్రామాలే పునాదులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆంధ్రుల సమగ్ర రచనకు గ్రామాల చరిత్రే పునాదులని శాసన సభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతిలో 'జలదంకి చెన్నకేశవ దేవాలయం చరిత్ర–శాసనాలు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పుస్తక రచయిత, కల్చరల్ సెంటర్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డితో పాటుగా మానసిక వైద్య నిపుణుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి, శ్రీచెన్నకేశవ భక్త మండలి ట్రస్ట్ చైర్మన్ ఎం.రంగయ్య, ఉపాధ్యక్షుడు డి.బ్రహ్మారెడ్డి, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి నారాయణ, లయోల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాంబశివరావు, అధ్యాపకులు డాక్టర్ ముద్వా శ్రీనివాస రెడ్డి, వెన్నా వల్లభరావు పాల్గొన్నారు.

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్
- జలదంకి చెన్నకేశవ దేవాలయం చరిత్ర శాసనాలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్, నాగిరెడ్డి తదితరులు

బుద్ధవిహార ప్రాజెక్టు నమూనా చిత్రపటం ఆవిష్కరణ

జిల్లాలోని ఘంటశాలలో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బుద్ధ విహార ప్రాజెక్టు నమూనా చిత్రపటాన్ని శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ శనివారం ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతిలో ఆవిష్కరించారు. ఘంటసాలకు చెందిన ఎన్నారై రంగనాథబాబు స్థాపించిన గొర్రెపాటి ఉదయ భాస్కరమ్మ, వెంకట్రాయుడు ట్రస్ట్ తరపున ఈ ప్రాజెక్టుకు రెండున్నర ఎకరాల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారని ప్రాజెక్టు రూపశిల్పి రేగుళ్ల మల్లి కార్జునరావు తెలిపారు. 100 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పు, 60 అడుగుల ఎత్తులో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు వచ్చే వారం ప్రారంభమవుతాయన్నారు.

సెలూన్ షాపులో యువకుడి ఆత్మహత్య


ఘటన స్థలంలో మృతుని తండ్రితో మాట్లాడుతున్న ఎస్ఐ శివరామయ్య

వినుకొండ టౌన్: హెయిర్‌స్టైల్ షాపులో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగు చూసింది. పట్టణంలోని రైలుపేటకు చెందిన రాయవరం అజయ్‌కుమార్ (19) ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెందాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.... లాయర్ స్ట్రీట్‌లోని సీహెచ్ రామాంజనేయులుకు చెందిన సెలూన్ షాపులో గత కొంతకాలంగా అజయ్‌కుమార్ పనిచేస్తున్నాడు. యజమాని రామాంజనేయులు గురువారం సాయంత్రం పనిమీద ఊరు వెళ్తూ షాపు తాళాలను కుమార్‌కు అప్పగించాడు. శుక్రవారం అంతా షాపును నిర్వహించిన అజయ్ రాత్రికి ఇంటికి వెళ్లకుండా షాపులోనే ఉండిపోయాడు. శనివారం ఉదయం 10 గంటలకు రామాంజనేయులు షాపు వద్దకు వచ్చి చూడగా బయటవైపు తాళం వేయకుండా ఉంది. దీనిని గమనించిన యజమాని ఒకవేళ అజయ్ టిఫిన్‌కు వెళ్లి ఉంటాడని భావించి షాపు షట్టర్‌ను పైకితీసి చూడగా అజయ్‌కుమార్ షాపులో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే రామాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, విషయాన్ని అజయ్‌కుమార్ తల్లిదండ్రులు ప్రసాద్, సంపూర్ణలకు తెలియ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ఎస్ఐ శివరామయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు : మానసిక వత్తిడికి గురైన ఇంజినీరింగ్ విద్యార్థి ఎలుకల మందు మింగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. చిలకలూరిపేట ప్రాంతానికి చెందిన బి.సురేష్ మండలంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల సమీపంలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాడు. కొద్దిరోజులుగా మానసిక ఒత్తిడికి గురవుతున్న విద్యార్థి శుక్రవారం రాత్రి ఎలుకల మందును మద్యంలో కలుపుకొని తాగాడు. అపస్మారక స్థితికి చేరుకొన్న యువకుడిని 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యువతి మౌనపోరాటం

బాపట్లలో భర్త ఇంటి ఎదుట నిరాహార దీక్ష చేపట్టిన అనూష


నిరాహారదీక్ష చేస్తున్న అనూష, ఆమె తరఫు బంధువులు

బాపట్ల : ప్రేమించి పెళ్లి చేసుకుని ఇప్పుడు కాపురానికి రానివ్వడంలేదంటూ ఓ వివాహిత తన భర్త ఇంటి ఎదుట శుక్రవారం రాత్రి నుంచి నిరాహార దీక్ష చేపట్టింది. తాను కాపురానికి వెళ్లినప్పటికి అత్త, మామ, భర్త నువ్వు ఇక్కడ ఉండవద్దంటూ మళ్లీ తీసుకువచ్చి పుట్టింటి వద్దే వదిలేస్తున్నారంటూ భోరున విలపించింది. బాధితురాలి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

పట్టణంలోని వివేకానందకాలనీలో కాపురం ఉంటున్న దేవూరి పిచ్చియ్య, వేలంగిణి కుమారుడు వికాస్ చీరాల మండలం రామానగర్‌కు చెందిన పి.నాగేశ్వరరావు,చిన్నమ్మాయిల కుమార్తె అనూష ప్రేమించుకున్నారు. వీరికి పెళ్లి చేసేందుకు వికాస్ తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో పెద్దలు రాజీ చేసి కట్నం క్రింద రూ.10 లక్షలు, 25 సవర్ల బంగారం ఇచ్చేందుకు ఒప్పించారు. గతేడాది ఏప్రియల్ 28న విజయవాడలో వివాహం చేశారు. తొలివిడతగా కట్నంలో రూ.4లక్షలు 25 సవర్లు బంగారం ఇచ్చారు. ఐదునెలలు తరువాత మిగతా సొమ్ము కూడా ఇచ్చేశారు.అప్పటి నుంచి అత్తింటివారు అనూషపై వేధింపులు మొదలు పెట్టి పుట్టింటికి పంపించివేశారు.

పోలీసులను ఆశ్రయించినా ఫలితం శూన్యం

అనూష తనకు న్యాయం చేయాలంటూ చీరాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కౌన్సెలింగ్‌లు ఇచ్చినా ఫలితం లేకుండాపోయింది. చివరికి ఈనెల 16న కౌన్సెలింగ్‌లో తాను అనూషతో కాపురం చేసేదిలేదని, జైలుకైనా పంపండంటూ వికాస్ చెప్పి రావడంతో అనూష మనస్తాపానికి గురైంది. బాపట్లలో అత్తింటి వద్దే తేల్చుకుంటానంటూ వచ్చి నిరాహార దీక్ష చేపట్టింది. అనూష బంధువులు కూడా అనూషతో పాటు పిచ్చియ్య ఇంటి వద్దనే నిరాహారదీక్ష చేపట్టారు. దీంతో అత్తమామ, భర్త అక్కడ నుంచి పరారయ్యారు. న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని అనూష బంధువులు చెబుతున్నారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడి మృతి


బాజీ మృతదేహం

రొంపిచర్ల : మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో కరెంట్ వైరు తగిలి భవన నిర్మాణ కార్మికుడు ఎస్‌కె బాజి(31) శనివారం మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బాజి గ్రామంలోని ఓ భవనంలో గోడ నిర్మాణ పనులు నిర్వహిస్తుండగా భవనం పక్కగా ఉన్న 11 కేవీ విద్యుత్ వైరు తగిలింది. విద్యుదాఘాతానికి గురైన బాజి భవనం పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. తండ్రిని కోల్పోయిన పిల్లలు, కుటుంబ ఆధారాన్ని కోల్పోయిన భార్య కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బంధువుల ఫిర్యాదుమేరకు రొంపిచర్ల ఎస్ఐ నక్కా ప్రకాశరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

కుక్కల దాడిలో ఐదుగురికి తీవ్రగాయాలు


సత్తెనపల్లిలో ఓ బాలుడి కాలిపై...

సత్తెనపల్లి : కుక్కల దాడిలో ఐదుగురికి తీవ్రగాయాలైన సంఘటన పట్టణంలోని 11వ వార్డు వెంగళరెడ్డి నగర్‌లో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల వెంగళరెడ్డినగర్‌లో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. వీటికి తోడు పెంపుడు కుక్క ఒక దానికి పిచ్చి ఎక్కడంతో అవి స్వైర విహారం చేస్తూ ఆడుకుంటున్న పిల్లలపై దాడికి దిగాయి. దాడిలో చిలకా ప్రిన్స్, మార్లిన్, స్వాతి, వంకాయలపాటి శ్రీను, సాగర్ గాయ పడ్డారు. ఎముకలు బయట పడేలా చిన్నారులపై కిరాతకంగా కుక్కలు దాడి చేశాయని క్షతగాత్రుల బంధువులు ఆవేదన వ్యక్త పరిచారు. హుటాహుటిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

కేసానుపల్లిలో పిచ్చికుక్క కాటుకు ఆరుగురికి గాయాలు


కేసానుపల్లిలో పిచ్చికుక్క దాడిలో గాయపడిన గోవర్దన్

16. Number of students who do not like any drink = 7% ⇒ 35
Total students ⇒ 100%
$\Rightarrow 35 \times \frac{100}{7} = 500$



No. of students who only like milk = 191 ***Ans: d***


17. Students who only like tea and cold drink = 5 ***Ans: a***

18. Students, exactly like two drinks = 180 + 38 + 5 = 223 ***Ans: b***

19. Students, who like at least one drink = 30 + 5 + 13 + 8 + 38 + 180 + 191 = 465 ***Ans: b***

20. Students who like at least two drink = 5 + 38 + 13 + 180 = 236 ***Ans: c***

21.



Up to 10 a.m. train from Q did not start, train from 'P' already travels $2 \times 40 = 80$ km
$\therefore$ Remaining distance = 30 km
time $= \frac{30}{40 + 50} = \frac{30}{90} = \frac{1}{3}$ hours
= 20 min
$\therefore$ They meet at 10:20 a.m. ***Ans: c***

నేడు కృష్ణా, గుంటూరు సైకాలజిస్ట్‌ల సమావేశం

నాదెండ్ల (చిలకలూరిపేట) : గుంటూరు, కృష్ణా జిల్లాల సైకాలజిస్ట్‌ల సమావేశం ఆదివారం ఉదయం 9.30 గంటలకు గుంటూరులో నిర్వహించనున్నట్లు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి, ఎంఎల్ గ్రూప్ ఆఫ్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ బాబూరావు చెప్పారు. సాయంత్రం 5 గంటల వరకూ జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు హాలులో హిప్నాటిజం, న్యూరో లింగిస్టిక్ ప్రోగ్రామింగ్ అనే అంశంపై సమావేశం జరుగుతుందన్నారు. వ్యక్తిత్వ వికాసం, సైకో థెరపీ, గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ అనే అంశాలపై కూడా చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జాతీయ అధ్యక్షులు డాక్టర్ హిప్నో కమలాకర్ వస్తున్నారని చెప్పారు. సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మత్స్యకారులకు వేట నిషేధ భృతి అందించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు డిమాండ్



నిజాంపట్నం (రేపల్లె) : మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో అందించే భృతి ఇప్పటి వరకూ ఇవ్వకపోవడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కూచినపూడిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేట నిషేధ సమయంలో ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.4 వేల భృతిని ప్రభుత్వం అందించాల్సి ఉందని తెలిపారు. అయితే ఇప్పటివరకూ కొందరికి మాత్రమే భృతి ఇచ్చారన్నారు. ఇంకా జిల్లాలో 1,100 కుటుంబాలకు పైగా వేట నిషేధ భృతి అందాల్సి ఉందని చెప్పారు. అలాగే, బోట్లకు ప్రభుత్వం అందించే డీజిల్ సబ్సిడీని సకాలంలో ఇవ్వకపోవడం వల్ల మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీజిల్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సేవా భారత్ పురస్కారం అందుకున్న రావూరి



ఫిరంగిపురం (తాడికొండ) : సేవాభారత్–శాంతి భారత్ పురస్కారాన్ని ఫిరంగిపురానికి చెందిన తెలుగు రాష్ట్రాల అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రీజినల్ డైరెక్టర్ రావూరి బాలరాజు ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఫోన్‌లో మాట్లాడుతూ స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకుని ఢిల్లీలోని ఢిల్లీ–కర్ణాటక సంఘ భవన్‌లో మహదయ కమిషన్ సభ్యులు జస్టిస్ నారాయణ చేతుల మీదగా తాను పురస్కారం అందుకోవడం ఎన్నటికీ మరువలేనని తెలిపారు. పురస్కారం అందుకోవడం మరింత బాధ్యతను పెంచినట్లయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తనతోపాటు శిఖరం థియేటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణ, లక్ష్మణరేఖ ఫేమ్ దర్శకుడు వి.గోపాలకృష్ణ, సత్యనారాయణ, మధుబాబు పాల్గొన్నారని వివరించారు.

ఆంధ్రా అగ్రికల్చరల్ జర్నల్ ఎడిటర్‌గా డాక్టర్ శ్రీనివాసరావు



బాపట్ల : ది ఆంధ్రా అగ్రికల్చరల్ జర్నల్ ఎడిటర్‌గా, విశ్వవిద్యాలయ సాంఖ్యక శాస్త్ర అధిపతిగా బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఆరేళ్లుగా జర్నల్‌కు కార్యదర్శిగా వ్యవహరిస్తూ ఎడిటర్‌గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో జర్నల్ నూతన సొసైటీకి వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పీఆర్కే ప్రసాద్ శనివారం అభినందనలు తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని బాపట్ల వ్యవసాయ కళాశాలలో 1954 నుంచి వ్యవసాయ ప్రచురణల్లో వివిధ వ్యవసాయ, అనుబంధ పరిశోధన పత్రాలను ప్రచురిస్తున్నారు. ది ఆంధ్రా అగ్రికల్చరల్ జర్నల్‌కు 2017–19కి గాను కొత్త కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకున్నారు. జర్నల్‌కు కార్యదర్శిగా ఉన్న వి.శ్రీనివాసరావు ఎన్‌ఏఏఎస్ రేటింగ్ సాధనలో కీలకపాత్ర పోషించారు. ఏఏజే 63వ సంపుటిని పూర్తి చేసుకుని 64వ సంపుటిని ముద్రిస్తోంది. ప్రస్తుత కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా డాక్టర్ వీఏకే మూర్తి, కార్యదర్శిగా డాక్టర్ ప్రసన్నకుమారి, కోశాధికారిగా డాక్టర్ కె.ఉమాదేవి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా డాక్టర్ సీహెచ్ చిరంజీవి, డాక్టర్ మార్టిన్ లూథర్, పి.అనిల్‌కుమార్, అడిషనల్ సభ్యులుగా డాక్టర్ బి.విమల, ఎం.రవిబాబు, ముకుందరావు, సుజన్‌రావు, ఏడుకొండలు ఎన్నికయ్యారు.

రెస్ట్ కాదు అరెస్ట్..!

రోడ్డు ప్రమాదాల నివారణకు ఏటా ఆర్టీసీ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తుంది. బస్సు నడిపే డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణలు ఇప్పిస్తుంది. ప్రయాణీకుల భద్రత పేరుతో నిధులు ఖర్చు పెడుతుంటుంది. ఇంత హడావిడి చేసే ఆర్టీసీ అధికారులు విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ (పీఎన్‌బీఎస్) లో దూర ప్రాంత సర్వీసుల డ్రైవర్లకు విశ్రాంతి తీసుకునే భాగ్యం మాత్రం కల్పించలేకపోతున్నారు. డ్రైవర్ల కోసం ప్రత్యేక గది ఉన్నా బస్టాండ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల వారు సేద తీరే అవకాశం లేక నిద్రకు దూరమవుతూ ఆందోళనకు గురవుతున్నారు.



ఆర్టీసీలో డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి గది

సాక్షి, అమరావతి బ్యూరో :

విజయవాడ బస్టాండ్‌లో అధికారుల నిర్లక్ష్యం కార్మిక వర్గాలకు ఇబ్బందిగా మారింది. రాజధాని ప్రాంతం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి ఆర్టీసీ సర్వీసులు ప్రయాణీకులతో విజయవాడకు చేరుకుంటున్నాయి. దూర ప్రాంతాల నుంచి బస్సు సర్వీసులను నడిపే డ్రైవర్లకు బస్టాండ్ లోవిశ్రాంతి తీసుకునే అవకాశం లేక కంటి మీద కునుకు దూరమవుతోంది. డ్రైవర్లు విశ్రాంతి తీసుకొనేందుకు బస్టాండ్‌లో ప్రత్యేకంగా 120 బెడ్‌లతోకూడిన ప్రత్యేక గది ఏర్పాటు చేశారు. అందులోపది ఏసీలు బిగించారు. ఆ గదిలో ప్రస్తుతంఏసీలన్నీ పని చేస్తున్నట్లు కన్పిస్తున్నా చల్లదనం రాక ఉక్కపోతతో ఉడికిపోతోంది. ఉక్కపోతతో డ్రైవర్లు నిద్రపోలేక ఆరుబయటే కూర్చొంటున్నారు. గదిలో ఫ్యాన్లు లేకపోవడంతోపాటు ఏసీల నుంచి కారే నీటితో గదిలో దుర్వాసన వస్తోంది.

- ఆర్టీసీ డ్రైవర్ల విశ్రాంతి గదిలో ఉక్కపోత
- ఏసీలు పని చేస్తున్నా చల్లదనం లేని వైనం
- దూర ప్రాంత డిపోల డ్రైవర్లకు కంటి మీద కునుకు కరువు
- నిద్ర లేమితో ప్రమాదాలు జరుగుతాయేమోనని ఆందోళన

నిద్రకు దూరమై..

దూర ప్రాంతాల నుంచి రాత్రంతా ఏకాగ్రతతో సర్వీసును తీసుకొచ్చిన డ్రైవర్లు పగటి సమయంలో విశ్రాంతి తీసుకొని తిరిగి సాయంత్రం తిరుగు ప్రయాణం అవుతుంటారు. రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి సుమారు వందకు పైగా సర్వీసులు విజయవాడకు చేరుకుంటాయి. రోజుకు కనీసం ఆరు గంటలపాటు డ్రైవర్లకు నిద్ర అవసరం. నిద్రకు దూరమైతే అలసటతో పాటు ఏకాగ్రత కోల్పోయే పరిస్థితి ఉంటుంది. అలా ఏకాగ్రత లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రెండు రోజుల క్రితం సూర్యాపేటలో నిలిపి ఉన్న ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణీకులు సురక్షితంగానే ఉన్నా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ అలసటకు గురై ఏకాగ్రత కోల్పోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది.

అధికారుల నిర్లక్ష్యం..

విజయవాడ పీఎన్ బస్టాండ్‌లో అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కన్పిస్తుంది. డ్రైవర్ల విశ్రాంతి గదిలో ఏసీలు సక్రమంగా పనిచేయకపోయినా వారు పట్టించుకోరు. పలుమార్లు డ్రైవర్లు ఫిర్యాదులు చేసినా స్పందన ఉండదు. గదిలో పది రోజుల కొకసారి కూడా బెడ్ షీట్లు మార్చడం లేదు. దీంతో బెడ్‌షీట్లు దుర్వాసన వస్తున్నాయి. వివిధ రుగ్మతలతో బాధపడే డ్రైవర్లు ఉంటారు. వారు వాడిన బెడ్ షీట్‌నే మరొకరు వాడితే ఇబ్బందిగా ఉంటుంది. ఏసీల నుంచి నీరు కారుతుండడంతో గది అపరిశుభ్రంగా మారింది.

ఉక్కపోతతో నిద్ర పట్టడం లేదు..



గదిలో నిద్రపోదామంటే ఉక్కపోత. ఏసీలు పని చేస్తూనే ఉంటాయి కానీ కూలింగ్ రాదు. బెడ్‌పై పడుకుంటే నిద్ర పట్టక ఆరుబయటే తిరుగుతున్నాం. ఏసీలు పని చేయటం లేదని చాలా సార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోరు. రాత్రంతా బస్సును నడిపి అలసిపోయి ఉన్నా విశ్రాంతి లేక ఇబ్బంది పడుతున్నాం.

– ఎన్‌వీ కుమార్, డ్రైవర్, కడప జిల్లా

ఆరు బయటే ఉంటున్నాం..



గదిలోకి వస్తే నిద్ర రాదు. బెడ్ షీట్లు పది రోజులకి ఒకసారి కూడా మార్చడం లేదు. అవి దుమ్ము పట్టిపోయాయి. ఏసీలు పని చేస్తున్నట్లు అన్పిస్తుందే కానీ కూలింగ్ రావటం లేదు. ఎన్నోసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదు.

– ఎస్ కె మున్నా, డ్రైవర్, కడప జిల్లా

26న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు సత్కారం

శంకుస్థాపన ప్రదేశం, సచివాలయ ప్రాంగణం పరిశీలించిన రూరల్ ఎస్పీ

తాడికొండ రూరల్ (తుళ్ళూరు) : ఈనెల 26న రాజధానిలో ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు సత్కారం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా సభా వేదిక ఏర్పాట్లను శనివారం రూరల్ ఎస్పీ వెంకటప్పల నాయుడు, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, పలువురు అధికారులు పరిశీలించారు. రాజధాని శంకుస్థాపన ప్రదేశంతో పాటు సచివాలయ ప్రాంగణంలో సభావేదిక ఏర్పాటు చేసే యోచనతో స్థలాన్వేషణ చేశారు. వారి వెంట ఏఎస్పీ విక్రాంత్ పాటిల్, పలువురు అధికారులు ఉన్నారు.


29న విజయవాడకు అమిత్ షా రాక

తెనాలి టౌన్ : బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఈ నెల 29, 30 తేదీల్లో విజయవాడలో పర్యటిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యడ్లపాటి రఘునాథబాబు తెలిపారు. స్థానిక కొత్తపేటలో ఉన్న బీజేపీ కార్యాలయంలో శనివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు కాట్రగడ్డ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి జాతీయ అధ్యక్షుడు పర్యటిస్తున్నారని చెప్పారు. పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, పదాధికారులతో విడివిడిగా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై సమీక్ష చేస్తారన్నారు. పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీలో కొనసాగుతున్న కౌన్సెలింగ్

గుంటూరు రూరల్ : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూజీ కోర్సుల కౌన్సెలింగ్ ప్రక్రియ మూడవ రోజు శనివారం కొనసాగింది. నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉన్న సమావేశ మందిరంలో జరుగుతున్న కౌన్సెలింగ్‌లో బీఎస్సీ ఆనర్స్ వ్యవసాయం, బీఎస్సీ హార్టీకల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీవీఎస్సీ కోర్సులకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ఓపెన్ కాంపిటీషన్‌లో ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 3,402 నుంచి 5,009 వరకూ, ఎస్వీయూలో 3,403 నుంచి 4,006 వరకూ, అన్ రిజర్వ్‌డ్‌లో 3,505 నుంచి 3,986 ర్యాంకుల వరకూ విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించి సీట్లను కేటాయించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ టీవీ సత్యనారాయణ తెలిపారు.

దారి చూపండి



ఇక్కడ వస్తున్న వ్యక్తి జపనీస్ కరెన్సీ సింబల్ 'యెన్' నుండి బయటికి రావాలి. దారి చూపండి.

నాన్నా చెప్పవా?

సముద్ర జలాల్లో లవణాలు ఎంతమొత్తంలో ఉంటాయి?



భూగోళం మీది సముద్ర జలాల్లో సోడియంక్లోరైడ్‌తో సహా వివిధ లవణాలు రమారమి 50 క్వాడ్రిలియన్ టన్నులు (50 మిలియన్ బిలియన్ టన్నులు) ఉన్నట్లుగా అంచనావేశారు. సముద్ర జలాల్లోని ఉప్పునంతటినీ తీసి నేల మీద పరిచినట్లయితే అది 500 అడుగుల ఎత్తు మందం పొరగా పొందుతుంది. దీనిని బట్టి సముద్ర జలాల్లో లవణాలు ఎంతమొత్తంలో ఉన్నాయో ఊహించుకోవచ్చు. సముద్ర జలాల్లోనే గాక మంచి నీటి వనరుల్లో కూడా లవణాలు ఎంతో కొంత మొత్తంలో ఉంటాయి. ఉదాహరణకు ఒకఘనపు అడుగు సముద్ర జలంలో సుమారు ఒక కిలో ఉప్పు ఉంటే, అంతే పరిమాణంలో తీసుకునే ఒక మంచినీటి సరస్సు తాలూకూ నీటిలో కేవలం 5 గ్రాముల ఉప్పు మాత్రమే ఉంటుంది. ఆ విధంగా ఒక మంచినీటి సరస్సులోని నీటికన్నా సముద్ర జలంలో లవణాలు 220 రెట్ల కన్నా ఎక్కువగా ఉంటాయి. అన్నట్లు భూమి ఉపరితలంలో 70 శాతం భాగాన్ని సముద్ర జలాలు ఆక్రమిస్తున్నాయి. భూగోళం మీద ఉన్న మొత్తం నీటిలో 98 శాతం దాకా నీరు సముద్రాలలోనే ఉంది. సౌర మండలంలో ఇంకే ఇతర గ్రహం మీద సముద్రాల వంటి జలరాశులు' లేవని శాస్త్రవేత్తలు అంటున్నారు. భూమిపై తొలిసారిగా ప్రాణులు ఆవిర్భవించినది కూడా సముద్రాలలోనే కావడం విశేషం.

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి





E	T	I	C	H	D	A	B
A	L	S	A	T	O	R	I
B	E	E	T	I	G	E	R
H	S	A	P	T	L	M	A
D	O	L	I	H	O	C	B
U	F	R	G	U	A	R	B
C	L	O	S	M	S	N	I
K	U	E	N	E	P	I	T



కనుక్కోండి

పక్కన పజిల్‌లో కింద ఉన్న బొమ్మల పేర్లు ఇంగ్లీషులో ఎక్కడ ఉన్నాయో కనుక్కోండి.

జూ



పెంగ్విన్లు నీటిలో ఉన్న ఉప్పును వేరుచేసి తాగుతాయి

రొయ్యలు వెనక్కి ఈదుతాయి



మీకు తెలుసా?

ప్రపంచంలో ఎక్కువ తీరప్రాంతం ఉన్నదేశం కెనడా



అట్లాంటిక్ సముద్రం పసిఫిక్ సముద్రంకన్నా ఉప్పగా ఉంటుంది






గుర్తించండి

పజిల్‌లో నాలుగు భాగాలు మిస్ అయ్యాయి. పక్కన ఇచ్చిన ఆ నాలుగు భాగాలు పజిల్‌లో ఎక్కడెక్కడ ఉండాలో గుర్తించండి

అంకెలు కలపండి.. రంగులు వేయండి



గుంటూరు | ఆదివారం | ఆగస్టు | 20 | 2017 సాక్షి

శివుడికే శఠగోపం..!

- శ్రీరామలింగేశ్వరస్వామి ఆస్తిని పప్పుబెల్లాల్లా పంచుకున్నారు
- దర్జాగా సొంత ఆస్తిలా రిజిస్ట్రేషను చేయించుకున్నారు
- మూడేళ్ల తర్వాత భయపడి రద్దు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు



శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, అర్చకుడికి కేటాయించిన స్థలం (ఖాళీస్థలం అవతల ఇళ్లు ఉన్న ప్రాంతం)

తెనాలి : శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు...ఇక్కడ మాత్రం కొందరు ప్రబుద్ధులు ఏకంగా ఆ పరమ శివుడి ఆస్తికే శఠగోపం పెట్టారు. ఆదిదేవుడి ఆస్తిని పప్పుబెల్లాల్లా పంచుకున్నారు. దర్జాగా రిజిస్ట్రేషను చేయించేసుకున్నారు. దేవుడి ఆస్తులను కంటికి రెప్పలా కాపాడాల్సిన అధికారులు ఈ నిర్వాకానికి తమ వంతు చేయూత అందించినట్టు ఆరోపణలున్నాయి. అంతలోనే ఏమైందో? ఏమో? మూడేళ్ల తర్వాత కొందరు హడావుడిగా రిజిస్ట్రేషన్లను రద్దు చేయించుకున్నారు. ఒకరు మాత్రం తనకేమీ కాదన్నట్టు దర్జాగా ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి.

తెనాలి పట్టణంలోని రామలింగేశ్వరపేటలో ఉన్న పురాతన ప్రాశస్తి కలిగిన శ్రీదుర్గాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి విలువైన భూములున్నాయి. 1981లో వీటిని కోర్టు ద్వారా స్వాధీనపరచుకోవాల్సివచ్చింది. వీటిలో ఆలయానికి వెనుకభాగంలో 312 గజాల స్థలం ఉంది. మార్కెట్ విలువ ప్రకారం దీని విలువ కోటి రూపాయలు. ఆలయంలో స్వామివారి సేవలు చేసుకొనే అర్చకుడికి నివాసం కోసం ఈ స్థలం కేటాయించారు. అర్చకుడి స్థానంలో ఎవరైతే ఉన్నారో? ఆ కుటుంబం ఇక్కడ నివసించేందుకు హక్కు ఉంది. సొంత స్థలంగా రిజిస్టరు చేసుకునేందుకు, విక్రయాది దాన హక్కులకు అవకాశం లేదు.

సమీప బంధువులే పంచుకున్నారు...

ఆలయ అర్చకుడైన వడ్లమూడి రాఘవేంద్ర శివవరప్రసాద్, అతడి సమీప బంధువులు ఈ స్థలాన్ని పంచుకున్నారు. నాలుగు భాగాలుగా విభజించుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టరు చేయించుకున్నారు. 2013 మార్చిలో ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా పూర్తిచేశారు. చిత్రమేమంటే అర్చకుడు శివవరప్రసాద్‌కు తమ సొంత ఆస్తి అన్నట్టుగా అతడి తల్లి రజనికుమారి 111 గజాల స్థలాన్ని రిజిస్టరు (ఎస్ఆర్ఓ నెం.2296/2013) చేశారు. అర్చకుడి బంధువైన నగ రాజకుమారి తన కుమారుడు సంగాపు సుబ్బారావుకు 53.75 గజాల స్థలాన్ని రిజిస్టరు (ఎస్ఆర్ఓ నెం.2315/2013)చేశారు. అర్చకుడి మరో సమీప బంధువైన స్వరాజ్యలక్ష్మి తమ ఇద్దరు కొడుకులకు 76 గజాలను రిజిస్టరు (ఎస్ఆర్ఓ నెం.2314/2013) చేశారు. మరో 55 గజాల స్థలాన్ని వడ్లమూడి సుబ్బారావు తన కోడలు సత్యశ్రీకి రిజిస్టరు చేశారు.

దేవాలయ భూమిని ఎలా రిజిస్టరు చేశారు?

అంటే నాలుగు రిజిస్ట్రేషన్లతో అయిదుగురు ఈ స్థలాన్ని దక్కించుకున్నారు. తమకు సంక్రమించిన భూమి అన్నట్టుగా రిజిస్ట్రేషన్లు చేయించడం విశేషం! దేవాదాయశాఖ ఆస్తుల రిజిస్ట్రేషను చేయాలంటే సంబంధిత అధికారుల లేఖ ఉండాలి. అప్పుడే రిజిస్ట్రేషను చేస్తారు. సమాచార చట్టం కింద దస్తావేజు కాపీలు తీసుకుంటే, అందులో ఆ శాఖకు సంబంధించి ఎలాంటి లేఖ/ అనుమతిపత్రం లేకపోవడం గమనార్హం! అలా లేకుండా ఎలా రిజిస్ట్రేషను చేశారన్నది సంబంధిత అధికారులకే తెలియాలి.



మూడేళ్ల తర్వాత రద్దు రిజిస్ట్రేషన్లు...

ఇదిలావుంటే, మూడేళ్లు గడిచాక వ్యవహారం బయటపడితే ఇబ్బంది అనుకున్నారో? ఏమో? అర్చకుడు రాఘవేంద్ర శివవరప్రసాద్‌కు తన తల్లి రజనికుమారి దఖలు దస్తావేజును 2016 జూలై 7వ తేదీన రద్దు చేసుకుంటూ రద్దు రిజిస్ట్రేషను చేయించారు. ఆ మరుసటి నెలలో నగ రాజకుమారి, సంగాపు సుబ్బారావు, స్వరాజ్యలక్ష్మి, ఆమె కుమారులు రిజిస్టరు చేయించుకున్న దఖలు దస్తావేజులను రద్దు రిజిస్ట్రేషను చేయించారు. మరో 55 గజాల స్థలాన్ని దఖలు దస్తావేజులు రిజిస్టరు చేయించుకున్నవారు అలాగే ఉంచేసుకున్నారు. రిజిస్ట్రేషను రద్దు చేయించుకున్నా, తొలుత దఖలు దస్తావేజులో 'తమకు సంక్రమించిన' అని పేర్కొన్నందున, వారి స్వాధీనంలో ఉన్నట్టుగానే భావించే అవకాశం ఉంది.

ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తాం

రిజిస్ట్రేషన్ల వ్యవహారం మా దృష్టికి వచ్చింది. దీనిపై చట్టప్రకారం వ్యవహరించదలిచాం. దేవాదాయశాఖ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి ఆలయ ఆస్తిని కాపాడేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటాం.

–ఎన్‌వీఎన్ మల్లేశ్వరి, ఆలయ ఈవో

పెండింగ్ జీతాల విడుదల కోరుతూ రాస్తారోకో



నిజాంపట్నం(రేపల్లె) : పెండింగ్‌లో ఉన్న న్యూట్రిషన్ కౌన్సిలర్ల జీతాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు.సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న న్యూట్రిషన్ కౌన్సిలర్ల జీతాలను ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని పల్లపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ 96 మందిని పల్లపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో నియమించి 15 నెలలు గడుస్తుంటే కేవలం మొదటి మూడునెలల జీతాలు మాత్రమే విడుదల చేశారని తెలిపారు.ఇప్పటికి 12 నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో మహిళలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే పెండింగ్ జీతాలను విడుదల చేయాలని లేకుంటే ఈ నెల 23వ తేదీ పల్లపట్ల ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పి శివకుమారి, శిరీష, రాధ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు వర్షంతో అంతరాయం

నరసరావుపేట ఈస్ట్ : ఆంధ్రా పబ్లిక్ స్కూల్ ఆవరణలోని ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–16 అంతర జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌కు వర్షం అడ్డంకిగా మారుతున్నది. వర్షం కారణంగా పలు మ్యాచ్‌లు పూర్తిగా నిర్వహించలేకపోయారు. శనివారం అనంతపురం, శ్రీకాకుళం జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ కూడా వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచిన అనంతపురం జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్ల నష్టానికి 43 పరుగులుచేసింది. అనంతపురం జట్టులోని వి.గణేష్ 2 వికెట్లు సాధించాడు. పోటీలను అండర్–16 రాష్ట్ర సెలక్షన్ కమిటీ సభ్యులు కె.కృష్ణమోహన్, జిల్లా సెలక్షన్ కమిటి సభ్యులు టి.అమర్‌నాథ్, జిల్లా ఈసీ సభ్యుడు సీతాపతిరావు, ఏసీఏ కోచ్ వి.కృష్ణ, గ్రౌండ్ కోఆర్డినేటర్ కేవీ పురుషోత్తమరావు పర్యవేక్షించారు.

బీఎస్ఎన్ఎల్ మేళా రేపు

ఆనందపేట(గుంటూరు) : బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా మెగామేళా నిర్వహిస్తున్నట్టు టెలికాం జిల్లా జనరల్ మేనేజర్ కె.వి.చౌదరి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా కొత్త కనెక్షన్ తీసుకున్న వారికి సిమ్ కార్డు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. కస్టమర్ల కొసం బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న ఆకర్షణీయమైన ఆఫర్లను వినియోగించుకోవాలని కోరారు.

కరివేపాకు, మిరప ఎగుమతులకు అనుకూలం

స్పైసెస్‌బోర్డు డి.డి శ్రీకంఠం తంబి



అచ్చంపేట : కరివేపాకు, మిరప పంటలు ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునేందుకు వీలుగా ఉంటాయని, నాణ్యమైన పంటల పండించేందుకు రైతులు ఉత్సాహం చూపాలని స్పైసెస్ బోర్డు డి.డి శ్రీకంఠం తంబి తెలిపారు. స్థానిక శ్రీ షిరిడిసాయిబాబా కల్యాణ మండపంలో నీలగిరి ఫౌండేషన్ ఆద్వర్యంలో జరిగిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కరివేపాకు, మిరప పంటలు పండించి, నాణ్యమైన ఉత్పత్తులను తీయవచ్చని, అధికధర పొందడానికి, ఇతర దేశాలకు ఎగుమతులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన సభకు నీలగిరి ఫౌండేషన్ సీఈవో ఎ.రఘురామిరెడ్డి అధ్యక్షత వహించారు. గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ (గ్యాప్) ఆడిటర్ నీరజ్‌పూరి మాట్లాడుతూ నాణ్యమైన మిర్చి పంట పండించిన రైతులకు ధ్రువపత్రాలను ఇస్తామని, వాటి ద్వారా రైతులు నేరుగా ఎక్కువ ధర పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. మరో ఆడిటర్ సుధీర్ శెట్టి మాట్లాడుతూ వ్యవసాయ భూమిని మ్యాప్ ద్వారా చూపించడం, భూసార పరీక్షలు, నీటి పరీక్షలు, దిబ్బఎరువు రిపోర్టు, పురుగు మందుల అవశేషాల రిపోర్టులను రైతులు చేయించుకుంటే గ్యాప్ (గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్) సర్టిఫికెట్స్ ఇస్తారన్నారు.

బీజెపీ పథాధికారుల సమావేశం



ఆనందపేట (గుంటూరు) : భారతీయ జనతా పార్టీ జిల్లా పథాధికారుల సమావేశం శనివారం బ్రాడీపేటలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి సమావేశానికి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర నాయకులు యడ్లపాటి రఘునాథబాబు మాట్లాడుతూ ఈనెల 28న బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా విజయవాడ వస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న భారీ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వల్లెపు కృపారావు, నలబోలు విష్ణు, గోరంట్ల సత్యనారాయణ, పి.రవి శంకర్, పి.రామకృష్ణ, పి.సత్యనారాయణ, రమావత్ శ్రీనివాస నాయక్, మామిడి ప్రకాష్, చావలి పద్మ, ఆవుల రామ కోటేశ్వరరావు, రాజేష్ నాయుడు, జగన్నాధ శాస్త్రి, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బ్యాంకు సేవలు సక్రమంగా అందేట్టు చూడాలి

అమరావతి : గ్రామీణ ప్రాంత మహిళలకు బ్యాంకులు అందించే సేవలపై అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హాబీబ్‌బాషా అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులైన మహిళలకు మారుతున్న బ్యాంకుల విధివిధానాలను వివరించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను గురించి అవగాహన కల్పించి వాటి ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో రైతుగ్రూపులను ఏర్పాటు చేసి, సేంద్రియ ఎరువులు వాడిన వారికే వివిధ పథకాల ద్వారా సాయం అందిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా అమరావతి ఆంధ్రాబ్యాంకుకు వెళ్లి డ్వాక్రా మహిళలకు సేవలను త్వరితగతిన అందించాలని కోరారు. సమావేశంలో ఏపీఎం రమాదేవి, సీసీలు రాఘవ తదితర సిబ్బందితో పాటు జిల్లా కార్యాలయ ఏపీఎమ్ సాంబశివరావు పాల్గొన్నారు.

అగ్రివర్సిటీల సదస్సులో ఆచార్య రంగా వర్సిటీ వీసీ

సాక్షి, అమరావతి : భారత వ్యవసాయ విశ్వవిద్యాలయాల అసోసియేషన్ స్వర్ణోత్సవాలలో భాగంగా శనివారం కోల్‌కతాలో ఏర్పాటైన భారతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఉప కులపతుల సమావేశానికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దామోదర్ నాయుడు హాజరయ్యారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల నుంచి రైతులు ఆశిస్తున్నదేమిటీ, ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలేమిటనే అంశంపై ఏర్పాటైన రెండు రోజుల మేథోమథన సదస్సులో ఆయన ప్రసంగించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 59 మంది

గుంటూరు ఈస్ట్ : నగరంలోని మూడు వంతెనల వద్ద శుక్రవారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 59 మంది పట్టుబడ్డారు. వీరిపై కేసులు నమోదుచేశారు. వారిలో 44మంది శనివారం కోర్టులో హాజరవగా ఒక్కొక్కరికి 2500 అపరాధ రుసుంతో పాటు 2 గంటలు ట్రాఫిక్ విధులు నిర్వహింపజేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 49 ద్విచక్రవాహనాలు, ఆరు ఆటోలు, నలుగురు కార్ల యజమానులపై కేసులు నమోదుచేసామని వివరించారు.

చివరికి చింతేనా ?

అదును.. పదును.. తప్పితే ప్రయోజనం ఉండదు. సకాలంలో నీరందకపోతే ఆశించిన దిగుబడులు రావని ఖరీఫ్ రైతులు లబోదిబోమంటున్నారు. ఆకాశం వైపు, కాలువల వైపు కళ్లు కాయలు కాచేలా చూస్తున్నారు. నాట్లు సంగతి పక్కన పెడితే నారుమళ్లు కాపాడుకోలేమోననే భయం చివరి ప్రాంత రైతులను పట్టిపీడిస్తోంది. వర్షాలు పడుతున్నప్పుడు అధికార పార్టీ నేతలు సాగు నీరు విడుదలపై చిలక పలుకులు పలుకుతున్నారని రైతులు అంటున్నారు. పది రోజులుగా వర్షాలు, కాలువలు రాకపోవడంతో ఖరీఫ్ సమయం మించిపోతోందని ఆందోళన చెందుతున్నారు. తక్షణమే చివరి ప్రాంత రైతులకు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



కొద్దిపాటి నీటిని మోటార్ల సాయంతో పంటలకు పెడుతున్న రైతులు



తగ్గిన కృష్ణానది నీటిమట్టం

- ప్రకాశం బ్యారేజీ ఆయకట్టు చివరి భూములకు అందని నీళ్లు
- ఎండిపోతున్న నారుమళ్లు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

తాడేపల్లి రూరల్:

ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్ రైతుల పాలిట శాపంగానే మారనుందా అనే అనుమానం వస్తోంది. జూన్‌లో అడపాదడపా కురిసిన వర్షాలకు నారుమళ్లు పోసుకున్న రైతులు నాట్లు వేయడానికి సిద్ధపడుతున్నారు. ప్రకాశం బ్యారేజ్ ఆయకట్టు కింద 14 వేల ఎకరాలు ఉండగా ఇప్పటికి కృష్ణా, గుంటూరు జిల్లాలో 4 లక్షల హెక్టార్లలో వరి సాగు జరగాలి. కానీ ఇప్పటి వరకు 45శాతం మాత్రమే నాట్లు పడినట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవంగా చూస్తే 30 శాతానికి మించి నాట్లు పడే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. నెల రోజుల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగైదు రోజులు ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. అప్పుడే పట్టిసీమ నీరు కూడా విడుదల చేశారు. అనంతరం వర్షాలు ఆగిపోవడంతో పట్టిసీమ నీరు కూడా నిలిపివేశారు. అయితే ముందస్తుగా నాట్లు వేసుకోండంటూ ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమా ప్రకాశం బ్యారేజీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. అయితే ఈ నీరు పూర్తి స్థాయిలో వదలకపోవడం వల్ల ఎగువ, తీర ప్రాంతాల్లో రైతులకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులే చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

గుంటూరు జిల్లాలోని బాపట్ల, పొన్నూరు, దుగ్గిరాల మండలం హైలెవల్ ఛానల్ కింద 20 వేల ఎకరాలలో, బాపట్ల డివిజన్ కింద లక్ష ఎకరాల పైన సాగు చేయాల్సి ఉంది. చివరి భూములకు సరిగా నీళ్లు వెళ్లక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తెనాలి మండలంలో కొల్లూరు, కొమ్మూరు కాలువ కింద 2 లక్షల ఎకరాలు ఉంది. వీరికి సైతం సాగు నీరు అందడం లేదు. రేపల్లె డివిజన్‌లో మాత్రం కొంత మేర సాగు నీరు వస్తున్నట్లు అక్కడి రైతులు చెబుతున్నారు. ఇక ప్రకాశం జిల్లాలోనైతే బకింగ్‌హామ్ కెనాల్ నుంచి నేటికీ సాగు నీరు చేరలేదు. కృష్ణా జిల్లాలో గుడ్లవల్లేరు, పుల్లేరుపైనే ప్రధానంగా సాగు జరుగుతోంది. అయితే ప్రకాశం బ్యారేజ్ కుడి కాలువ నుంచి విడుదలయ్యే సాగు నీరు ప్రధాన కాలువలకు అరకొరగా వదులుతూ ఉన్నారు. రామరాజుపాలెం ఛానల్‌లో రెండడుగులకు మించి నీటి ప్రవాహం లేదు. దీంతో రైతులు కాలువల పక్కన ఉన్న వారు ఆయిల్ ఇంజన్లు పెట్టి నానా తంటాలు పడుతున్నారు. బ్రాంచ్ కాలువల్లోకి చుక్క నీరు రాకపోవడంతో నారుమళ్లు, వెదజల్లిన పొలాలు ఎండిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిడుమోలు లాకుల వద్ద ఎగువ రైతులు తమ అవసరాలకు నీటిని నిల్వ చేసుకుని అతి తక్కువ సామర్థ్యంతో రామరాజుపాలెం ఛానల్‌కు నీటిని పంపిస్తున్నారు. ఆకుమర్రు లాకుల వద్ద నుండి గూడూరు, పెడన నుండి పెదపట్నం వరకు కాలువ ఇరువైపులా ఉన్న పంట పొలాలకు సాగునీరు చేరడం లేదు. అలాగే బందరు మండలంలోని పంట పొలాలకు కూడా నీరు అందడం లేదని, తాళ్ళపాలెం, పెదపట్నం, కానూరు, గోకవరం తదితర ప్రాంతాల రైతులు తెలుపుతున్నారు. గూడూరు మండలంలోని గూడూరు, శారదాయిపేట, ఆకులమన్నాడు, కప్పలదొడ్డి, పెడన పాలెంలకు నీరు చేరడం లేదు. ఇక పెడన మండలంలో రామరాజు పాలెం పరిధిలోని బల్లిపర్రు, మడక, తోటమూల, నందమూరు ప్రాంతాల రైతులకు సాగునీరు రామరాజుపాలెం ఛానల్‌నుండి వెళ్ళాల్సి ఉందని, ఇక్కడ కూడా బ్రాంచి కాలువలకు నీరు చేరడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

నారుమళ్లకు పెట్టుబడులు

ఇప్పటికే నారుమళ్లకు ఎకరానికి రూ.3 వేలు నుంచి రూ. 4 వేలు, జల్లిన పొలాలకు ఎకరానికి రూ. 6 వేలు నుంచి రూ. 7 వేల వరకు ఖర్చు చేశామని రైతులు చెబుతున్నారు. నెల లోపు వయసు ఉన్న నారుమడిని తీసినాట్లు వేసినప్పుడు అత్యధికంగా పిలకలు తొడిగి ఆశాజనకంగా దిగుబడులు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే నేడు 40 నుండి 50 రోజుల వయసుకు నారుమళ్ళు చేరుకున్నాయి. అంటే పిలకలు తొడిగే సమయం మించిపోతుందని రైతులు తెలుపుతున్నారు. తక్షణమే తీరప్రాంత నియోజకవర్గాలైన అవనిగడ్డ, బందరు, పెడన పరిధిలోని గ్రామాలకు సాగు నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆయేషా కేసు పునర్విచారణ అనుమతి మాకు లేదు

నాలుగో అదనపు చీఫ్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ ఇందిరా ప్రియదర్శిని

విజయవాడ లీగల్ : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బీ ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో పునర్విచారణకు అనుమతినిచ్చే అధికారం ఈ కోర్టుకు లేదంటూ విజయవాడలోని నాలుగో అదనపు చీఫ్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ యు.ఇందిరా ప్రియదర్శిని శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయేషా హత్య కేసు పునర్విచారణకు అనమతి కోరుతూ ప్రత్యేక విచారణ దళం (సిట్) కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై వాదనలు పూర్తయిన అనంతరం పునర్విచారణకు అనుమతిచ్చే అధికారం ఈ కోర్టుకు లేదంటూ న్యాయమూర్తి తిరస్కరించారు. సిట్ తరపున ప్రభుత్వ ముఖ్య న్యాయ సలహాదారు నాగరఘు తన వాదనలు వినిపిస్తున్నప్పుడే న్యాయమూర్తి కల్పించుకుని ఈ కోర్టుకు పునర్విచారణకు అనుమతి ఇచ్చే పరిధి ఉందా అని ప్రశ్నించారు. అంతే కాకుండా హైకోర్టు డైరెక్షన్ కూడా లేదు కదా అని ప్రశ్నించారు.

ఏఎస్ఐ కృష్ణచైతన్యకు ఘనస్వాగతం



కృష్ణచైతన్యకు స్వాగతం పలుకుతున్న డీసీపీ, డీఎస్పీ, ఏసీపీలు

గన్నవరం: అంతర్జాతీయ పోలీస్ క్రీడ పోటీల్లో అత్యధిక పతకాలు సాధించిన ఏఎస్ఐ కృష్ణచైతన్యకు శనివారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. న్యూఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానంలో ఉదయం 8.30 గంటలకు ఆయన ఇక్కడికి చేరుకున్నారు. ఇటీవల అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఈత పోటీల్లో కృష్ణచైతన్య మొత్తం ఎనిమిది పతకాలను సాధించాడు. వీటిలో మూడు స్వర్ణ, నాలుగు రజత, ఒక కాంస్య పతకాలున్నాయి. విజయవాడ కమిషనరేట్‌లో పని చేస్తున్న కృష్ణచైతన్యకు ఎయిర్‌పోర్టులో డీసీపీ బ్రహ్మారెడ్డి, స్పోర్ట్స్ డీఎస్పీ అరుణ, ఎయిర్ పోర్టు ఏసీపీలు రాజీవ్‌కుమార్, రాయపాటి శ్రీనివాస్ తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

ఏపీ మాదిగ సంఘాల జేఏసీ ఆవిర్భావం

చైర్మన్‌గా కృపాకర్

విజయవాడ(గాంధీనగర్): ఆంధ్రప్రదేశ్ మాదిగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భవించింది. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాదిగ, మాదిగ ఉపకుల సంఘాల సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో జేఏసీ ఏర్పాటు చేశారు. అనంతరం జేఏసీ చైర్మన్‌గా పానుగోటి కృపాకర్, చీఫ్ కన్వీనర్ తాతపూడి రవీంద్రనాథ్ ఠాగూర్, చీఫ్ ఎడ్వైజర్‌గా డా. తెన్నేటి జయరాజ్ నియమితులయ్యారు. జేఏసీ కన్వీనర్‌గా పేరుపోగు వెంకటేశ్వరరావు (ఏపీ ఎమ్మార్పీఎస్), వనం నాగేశ్వరరావు (బేడబుడ్గ జంగం), మట్టా ప్రభాత్‌కుమార్ (మాదిగ మహాసభ)లతోపాటు మరో 17 మందిని కన్వీనర్లుగా నియమించారు.

నకిలీ పచ్చళ్ల గుట్టురట్టు

పెదకాకాని : గుంటూరు ఆటోనగర్‌ను అడ్డాగా చేసుకుని పెద్ద ఎత్తున నకిలీ పచ్చళ్లు తయారు చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. ముందస్తు సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్పీ శోభా మంజరి ఆధ్వర్యంలో గుంటూరు ఆటోనగర్‌లో నకిలీ పచ్చళ్ల తయారీ కేంద్రంపై శుక్రవారం రాత్రి దాడులు చేశారు. పెద్ద ఎత్తున నకిలీ పచ్చళ్లు, రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు. అధికారుల పరిశీలనలో పచ్చళ్లు బూజు పట్టి, పాడైపోయి ఉన్నట్లుగా తేలింది. నిర్వాహకుల వద్ద తయారీకి సంబంధించి ఎటువంటి అనుమతులూ లేవు. గతంలోనూ ఇదే గోడౌన్‌లో కేదర్స్ జ్యూస్ పేరుతో నకిలీ జ్యూస్ తయారు చేయడంతో అర్బన్ ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాల మేరకు నిర్వాహకులపై చర్యలు తీసుకున్నారు. ఎస్పీ ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లడంతో నిర్వాహకులు మళ్లీ పచ్చళ్ల తయారీ కోసం భారీ ఎత్తున రంగం సిద్ధం చేసుకున్నారు.



పచ్చళ్లను తనిఖీ చేస్తున్న ఎస్పీ శోభామంజరి

రూ.1.80 కోట్ల పచ్చళ్లు సీజ్

దాడుల్లో గోడౌన్‌లోని రూ.1.80 కోట్ల విలువైన పచ్చళ్లను సీజ్ చేశారు. నిర్వాహకుడు లక్ష్మయ్యగా గుర్తించినప్పటీ ఇంత భారీ మొత్తంలో పచ్చళ్ల తయారీ వెనుక పెద్దల హస్తం ఉందేమోనని విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేపట్టారు.
దీనిపై విజిలెన్స్ ఎస్పీ శోభామంజరి మాట్లాడుతూ గోడౌన్‌లో పచ్చళ్లు, రసాయనాలు శాంపిల్స్ సేకరించి టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపామని, రిపోర్ట్ ఆధారంగా నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

కుళ్లిన పచ్చళ్ల కంపెనీ పిడుగురాళ్ల వాసిదే..

యజమానిని తప్పించాలని చూస్తున్న టీడీపీ నేత

పిడుగురాళ్ల టౌన్: నోరూరించే ఇంటి రుచుల పేరుతో గుంటూరులో పచ్చళ్ల తయారీ కంపెనీ పెట్టి కుళ్లిన పచ్చళ్లను రీసైక్లింగ్ చేస్తూ విజిలెన్స్ అధికారులకు పట్టుబడిన కేదార్ ప్రొడక్స్ కంపెనీ యజమానిది పిడుగురాళ్లే. శుక్రవారం కుళ్లిన పచ్చళ్లను రీసైక్లింగ్ చేస్తూ విజిలెన్స్ అధికారులకు పట్టుబడిన విషయం పాఠకులకు తెలిసిందే. అయితే ఈ కుళ్లిన పచ్చళ్లను విక్రయిస్తున్నది పిడుగురాళ్లకు చెందిన కె. రాము అని తెలియడంతో పట్టణంలో చర్చాంశనీయమైంది. కేదార్ ప్రొడక్స్ యజమాని కె. రాము గతంలో సున్నం వ్యాపారం చేస్తూ గుంటూరులో ఓ కంపెనీ స్థాపించి పికిల్స్, కూల్‌డ్రింక్స్ తయారు చేసి విక్రయించాడు. ఇప్పుడు కుళ్లిన పచ్చళ్ల కేసు నుంచి ఎలాగైనా బయట పడేయాలని పిడుగురాళ్లకు చెందిన అధికార పార్టీ నాయకుడు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

అమ్మో ఆర్టీసీ..!

- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్టీసీ అధికారులు
- ఆర్టీసీ అద్దె బస్సులపై డిపో మేనేజర్‌ల పర్యవేక్షణ కరువు
- ఫిట్‌నెస్‌లు, ధృవీకరణ పత్రాలు లేని బస్సులు.. లైసెన్స్ లేని డ్రైవర్‌లు
- జిల్లాలో నాలుగేళ్ళుగా తిరుగుతున్న 275 అద్దె బస్సులు
- ఆర్టీప అధికారుల తనిఖీల్లో బయటపడ్డ బండారం
- ఆర్టీసీ అద్దె బస్సు స్కూల్ బస్సును ఢీకొట్టిన ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

సాక్షి, గుంటూరు :

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం అంటూ బస్సులపై స్లోగన్‌లు కనిపిస్తున్న విషయం తెలిసిందే. అయితే దీన్ని మరిచి ఆర్టీసీ అద్దె బస్సులను ఇష్టానుసారంగా నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులు.. ధృవీకరణ పత్రాలు లేకుండా తిరగడం.. లైసెన్సు రెన్యూవల్ చేయించుకోని డ్రైవర్లతో బస్సులు నడపడం వంటివి చేస్తూ ప్రైవేటు బస్సులకు ఏమాత్రం తీసిపోని విధంగా రోడ్లపై ఇష్టానుసారంగా తిప్పుతున్నారు. నాలుగేళ్ళ క్రితం అద్దె బస్సులను తీసుకుని జిల్లాలోని పలు ప్రాంతాల్లో తిప్పుతున్నారే తప్ప, వాటిపై ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ కరువైంది. అంతేకాకుండా అతి వేగంగా బస్సులు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. దీంతో బస్సుల్లో ప్రయాణీకులకు సరైన సౌకర్యాలు లేకపోవడం వంటి వ్యవహారాలన్నీ రవాణా శాఖ అధికారులు శనివారం జిల్లావ్యాప్తంగా జరిపిన దాడుల్లో ఆర్టీసీ అద్దె బస్సుల బండారం బట్టబయలైంది. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళితే...

గుంటూరు రీజియన్ పరిధిలో 275 అద్దె బస్సులు ఆర్టీసీ కింద తిరుగుతున్నాయి. నాలుగేళ్ళ క్రితం వీటిని పరిశీలించి అగ్రిమెంట్ కుదుర్చుకున్న అధికారులకు ఆ తర్వాత వీటిపై పర్యవేక్షణ కరువవడంతో అద్దె బస్సుల నిర్వాహకులు ఇష్టానుసారంగా బస్సులను తిప్పుతున్నారు. ఆర్టీసీ అద్దె బస్సుల్లో ప్రయాణీకులు ఎక్కేందుకు ఫుట్‌బోర్డులు విరిగిపోవడం, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు లేకపోవడం, సీట్లు చినిగిపోయి ఉండటం, బాడీ తుప్పు పట్టినా ఆర్టీసీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో వీరికి భయం లేకుండాపోయింది. ఈనెల 10వ తేదీన ఫిరంగిపురం మండలం వేములూరుపాడు వద్ద విద్యార్థులను ఎక్కించుకుంటున్న స్కూల్ బస్సును అతి వేగంగా వచ్చిన ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో పది మంది విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రాణాపాయం నుంచి బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లావ్యాప్తంగా తనిఖీలు..

జిల్లాలో ఆర్టీసీ అద్దె బస్సుల వల్ల అనేక ప్రమాద ఘటనలు జరుగుతుండటంతో రవాణా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం జిల్లావ్యాప్తంగా 104 ఆర్టీసీ అద్దె బస్సులను తనిఖీలు చేయగా వీరి బండారం బట్టబయలైంది. ఇందులో ఒక బస్సుకు ఫిట్‌నెస్ లేకపోవడంతో దాన్ని సీజ్ చేశారు. మరో నాలుగు బస్సులకు సంబంధించిన ఏ ఒక్క ధృవీకరణ పత్రం లేకపోవడంతో వాటిని చూపే వరకు నాలుగు బస్సులను సీజ్ చేస్తున్నట్లు రవాణా శాఖ అధికారులు చెప్పారు. ఇంకా 171 బస్సులను తనిఖీ చేయాల్సి ఉండటంతో ఇంకెన్ని బస్సులపై రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది. అంతేకాకుండా ప్రయాణీకులకు సౌకర్యాలు లేకుండా తిప్పుతున్న మరో 20 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఆర్టీసీ గుంటూరు రీజియన్ పరిధిలో 275 హయ్యర్ బస్సులు నాలుగేళ్ళుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రయాణీకులను ఎక్కించుకుని తిరుగుతున్నాయి.

కృష్ణా పుష్కరాలకూ ఈ బస్సులే..

గుంటూరు జిల్లాలో గత ఏడాది ఆగస్టు నెలలో జరిగిన కృష్ణా పుష్కరాల సమయంలో సైతం ఈ బస్సులే తిరిగాయి. లక్షల మంది భక్తులు పుష్కరాల సమయంలో కిక్కిరిసిపోయి ఈ బస్సుల్లో ప్రయాణించారని తలుచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. ఫిట్‌నెస్‌లు, సౌకర్యాలు లేని అద్దె బస్సుల్లో విపరీతమైన రద్దీ సమయాల్లోనూ ప్రయాణీకులను ఎక్కించడం చూస్తుంటే ఆర్టీసీ అధికారులు ప్రజల ప్రాణాలతో ఏ విధంగా చెలగాటం ఆడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.



వైఎస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నవ్యాంధ్రకు నవరత్నాలు..

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన 'నవరత్నాలు' సంక్షేమ పథకాలపై శనివారం వినుకొండలో బూత్ కమిటీల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత, సినీ నటుడు విజయ్‌చందర్, పార్టీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రావి వెంకటరమణ, పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి కావటి మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

– వినుకొండ



డూడూ బసవన్నా! కూటి కోసమన్నా!

సంక్రాంతి ఇప్పట్లో లేకున్నా 'డూడూ.. బసవన్నా!' అంటూ కారంపూడిలో గంగిరెద్దుల వాళ్లు కనిపిస్తున్నారు. ఇంటింటికి తిరిగి భిక్షాటన చేస్తున్నారు. సంక్రాంతి రోజుల్లోనే తిరగడం ఆనవాయితీ అయినా తమకు తెలిసిన విద్య ఇదేనని.. పొట్టకూటి కోసం.. ఇలా రోడ్డున పడాల్సి వచ్చిందని వాపోతున్నారు. వీళ్ల ఆవేదనను గుర్తించిన స్థానికులు వారికి ఏదో ఒకటి ఇచ్చి సంతృప్తిపరిచి పంపుతున్నారు.

– కారంపూడి (మాచర్ల)

పదోన్నతుల్లో పారదర్శకత పాటించాలి

గుంటూరు వెస్ట్ : ఎయిడెడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని యు.టి.ఎఫ్.నాయకులు జాయింట్ కలెక్టర్–2 ముంగా వెంకటేశ్వరరావుకు శనివారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో వినతిపత్రం అందజేసారు. పాఠశాలల్లో సీనియారిటీ ప్రకారం లిస్టులను తయారు చేసి అర్హులైన వారికే పదోన్నతులు కల్పించాలన్నారు. కొన్ని పాఠశాలల్లో సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా జూనియర్లకు పదోన్నతులు ఇస్తున్నట్లు తెలిపారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. స్పందించిన జె.సి. విద్యాశాఖాధికారితో విచారణ చేయిస్తానన్నారు. జె.సి.ని కలిసిన వారిలో ఎం.ఎల్.సి. బొడ్డు నాగేశ్వరరావు, యు.టి.ఎఫ్. రాష్ట్ర సహాధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, జిల్లా కోశాధికారి ఎం.ప్రేమ్‌కుమార్, ఎం.కళాధర్ ఉన్నారు.

26 న ఉప రాష్ట్రపతి తెనాలి రాక

- ఆలపాటి వెంకట్రామయ్య పుస్తకావిష్కరణకు హాజరు
- హెలిపాడ్ల స్థలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

తెనాలి : భారత ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు ఈనెల 26న తెనాలి రానున్నారు. విజయవాడకు వస్తున్న సందర్భంగా అదేరోజు మధ్యాహ్నం తెనాలి వచ్చేందుకు ఆయన సమ్మతి తెలిపారు. ఆరోజు చెంచుపేటలోని చావాస్ గ్రాండ్‌లో ఏర్పాటయ్యే సభలో పట్టణానికి చెందిన రాజకీయ ప్రముఖుడు, మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య శత జయంతి సందర్భంగా రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. స్వస్థలమైన సమీప గ్రామం యడ్లపల్లిలో వచ్చే నెల 9న ఏర్పాటు చేయనున్న వెంకట్రామయ్య నిలువెత్తు విగ్రహాన్ని అక్కడే ఆవిష్కరిస్తారు. ఈ మేరకు వెంకట్రామయ్య మనుమరాలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమకు సమాచారం వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కోన శశిధర్, ఎస్పీ సీహెచ్ వెంకటప్పలనాయుడు శనివారం సాయంత్రం తెనాలి వచ్చారు. ఉప రాష్ట్రపతి పర్యటనకు రక్షణ శాఖకు చెందిన మూడు హెలికాప్టర్లు రానున్నందున, వాటికి అనువైన హెలిపాడ్ల కోసం వివిధ స్థలాలను పరిశీలించారు. సభా కార్యక్రమం నిర్వహించే చావాస్ గ్రాండ్ కళ్యాణ మండపానికి దగ్గర్లోని మార్కెట్ యార్డులో రెండు హెలిపాడ్ల ఏర్పాటుకు అవకాశం ఉందని నిర్ణయించారు. అలాగే, నారాకోడూరు రోడ్డు పక్కన కన్నెగంటి రెడ్డెమ్మకు చెందిన ఖాళీ స్థలంలో మూడో హెలిపాడ్ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికొచ్చారు. కళ్యాణ మండపం ముందువైపు రోడ్డును బాగు చేయించాలని మున్సిపల్ కమిషనరు కె.శకుంతలను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉప రాష్ట్రపతి పర్యటనపై తమకు అధికారిక సమాచారం ఇంకా రాలేదని చెప్పారు. ప్రైవేటు కార్యక్రమం అయినా ప్రొటోకాల్ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెనాలి ఆర్డీవో జి.నర్సింహులు, తహశీల్దారు జీవీ సుబ్బారెడ్డి, విద్యుత్ ఎస్ఈ జయభారత్‌రావు, తెనాలి డీఈ ఆవుల మురళీకృష్ణయాదవ్, ఆర్అండ్‌బీ ఈఈ ఫకీర్‌బాబు, తెనాలి డీఎస్పీ జీవీ రమణమూర్తి, సీఐలు బి.శ్రీనివాసరావు, కళ్యాణ్‌రాజు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



యార్డులో హెలిపాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కోన శశిధర్, ఎస్పీ వెంకటప్పలనాయుడు

ఆయనపై గౌరవం పెరిగింది...

మాజీ ఎమ్మెల్యే ఉమ మాట్లాడుతూ స్వర్గీయ ఆలపాటి వెంకట్రామయ్య శత జయంతి సందర్భంగా పుస్తకావిష్కరణకు రావాలని కేంద్ర మంత్రి హోదాలో ఉన్న వెంకయ్యానాయుడును ఏప్రిల్‌లో కలిసి కోరగా, తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. తర్వాత ఉప రాష్ట్రపతిగా ఎన్నికైనప్పటికీ తన హామీని గుర్తు పెట్టుకుని పుస్తకావిష్కరణకు వచ్చేందుకు అనుమతించటం గొప్ప విషయంగా భావిస్తున్నామని చెప్పారు.

సాక్షి Weekend
Sunday 20 August 2017
10-11



కాసులపేరుతో చేస్తున్న బ్లౌజ్ ఇదే..



బ్లౌజ్ డిజైనింగ్

■ అతివల బ్లౌజ్ డిజైనింగ్‌లో సరికొత్తదనం ■ కాసులపేరుతోనూ అలంకరణ

తెనాలి : అతివల అభిరుచికి ఆకాశమే హద్దు అనిపిస్తోంది. డ్రెస్‌ల డిజైనింగ్‌లోనే కాదు.. బ్లౌజ్, చీరలు, క్రాప్ టాప్స్, లంగా ఓణీ సెట్స్‌లో ఆధునికతతో అందం ఉట్టిపడేందుకు మొగ్గు చూపుతున్నారు. మగ్గం వర్క్, కంప్యూటర్ వర్క్, మిషన్ వర్క్‌తో ఆడవాళ్ల మనసుదోచేలా డిజైన్లు తయారుచేయించుకుంటున్నారు. ఇంతకుముందు బ్లౌజుల్లో స్టోన్‌వర్క్ అధికంగా ఉండేది. ప్రస్తుతం జర్దోజి, త్రెడ్ వర్క్, మిర్రర్ వర్క్ చేయిస్తున్నారు. హైనెక్, బోట్‌నెక్‌తో సహా బ్లౌజుల్లో చాలా మోడల్స్‌ను రూపొందిస్తున్నారు. జింకలు, పులులు, ఏనుగులు వంటి జంతువుల బొమ్మలు, చిలుక, సీతాకోకచిలుకలు, దేవతల బొమ్మలు, కొండపల్లి బొమ్మలతోనూ బ్లౌజ్‌లను సింగారించుకుంటున్నారు. ఈ పోకడల్లో భాగంగా తెనాలిలో తొలిసారిగా కాసులపేరుతో బ్లౌజ్‌ను ముస్తాబు చేశారు. ఇందుకు వన్‌గ్రామ్ గోల్డ్‌ను వినియోగించినట్టు స్థానిక శ్రీనాగం మగ్గం వర్క్స్ బొటిక్స్ యజమాని నాగవాణి చెప్పారు.

రోజుకో ట్రెండ్

భార్యాభర్తలు ఒకే తరహా డిజైన్ దుస్తులను తయారుచేయించుకుని వేడుకల్లో పాల్గొనడం తాజా ట్రెండ్. ఒక్కోసారి పిల్లలతో సహా కుటుంబం మొత్తం ఒకే డిజైన్ దుస్తులతో తయారై వెళ్తూ అందరి దృష్టినీ తమవైపు తిప్పుకొంటున్నారు. అంతే కాదండోయ్ స్కూల్ ఫంక్షన్‌లలోనూ తమ పిల్లలకు ప్రత్యేక డిజైన్లతో దుస్తులు రూపొందించి, బడికి పంపుతున్నారు. నచ్చిన డిజైన్‌తో దుస్తుల తయారీ కోసం డబ్బు గురించి ఆలోచించట్లేదు. బొటిక్స్ యజమానులు కూడా ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తూ, ఇతర నగరాలు, విదేశాల నుంచి ఆర్డర్లు రాబడుతున్నారంటే అతిశయోక్తి కాదు.

ఎప్పటికప్పుడు కొత్తగా..



ఒకసారి వేసిన డిజైన్ మళ్లీ వేయడానికి మహిళలు ఇష్టపడటం లేదు. బ్లౌజ్ డిజైన్ దుస్తులు తమ అందాన్ని రెట్టింపు చేసేలా ఉండాలి. ఈ అభిరుచి ఏదైనా ఒక వర్గానికే పరిమితమై లేదు సుమా! కాస్త స్తోమత కలిగిన మహిళలు, తమ అందాన్ని మెరుగుపరుచుకోవడానికే చూస్తున్నారు. వారి ఇష్టాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లను రూపొందిస్తున్నాం.
– నాగవాణి, శ్రీనాగం మగ్గం వర్క్స్, తెనాలి



వినువీధిలో విహారిద్దాం..



ఆశలకు రెక్కలొస్తే.. కలలు నిజమైతే.. ఊహా ప్రపంచం ఒళ్లో వచ్చి వాలితే.. అబ్బో ఆ ఆనందమే వేరు. ఇప్పుడు మధ్య తరగతి ప్రజలు ఆ అనుభూతినే ఆశ్వాదిస్తున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు పెరగడం, అతి తక్కువ ధరకే ఆఫర్ టికెట్లు లభిస్తుండటంతో ఇప్పుడు మధ్య తరగతి ప్రజలకు విమానయానం చేరువైంది. చౌకధరకే దేశమంతా తిరిగొస్తున్నారు.

విమానాశ్రయం (గన్నవరం) : ఒకప్పుడు ధనిక వర్గాలకే పరిమితమైన విమాన ప్రయాణం ప్రస్తుతం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కూడా అందుబాటులోకి వచ్చింది. ఎయిర్‌లైన్స్ సంస్థల మధ్య నెలకొన్న పోటీ కారణంగా విమాన టికెట్ల ధరలు కిందకు దిగి వస్తున్నాయి. దీనికితోడు పెరిగిన ఆదాయ వనరులు, గమ్యస్థానాలకు తొందరగా చేరుకునేందుకు విమాన ప్రయాణం సులువైన మార్గంగా మారింది. ఫలితంగా దేశవ్యాప్తంగా విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. కోస్తాంధ్రకు విమానాయన కేంద్రంగా ఉన్న గన్నవరం ఎయిర్‌పోర్టు మాత్రం ప్రయాణికుల పరంగా గణనీయమైన వృద్ధిని నమోదుచేస్తోంది. పెరిగిన ప్రయాణికుల ఆదరణ దృష్ట్యా ఇక్కడికి విమాన సర్వీసులు నడిపేందుకు కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ ఎయిరిండియాతో పాటు పలు ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రయాణికులను ఆకట్టుకునేందుకు విమాన సంస్థలు ఆఫర్లు కూడా ప్రకటిస్తున్నాయి.

నాలుగేళ్లలో నాలుగు రెట్లు

గన్నవరం విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య నాలుగేళ్లలో నాలుగు రెట్లు పెరిగింది. కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల ప్రజలు ఎక్కువగా విమాన ప్రయాణంవైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా గతంలో రోజుకు 200 నుంచి 300 వరకూ ప్రయాణికులు రాకపోకలు సాగించే విమానాశ్రయంలో ప్రస్తుతం రెండువేల నుంచి 2,500 మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో రెగ్యులర్‌గా ప్రయాణించేవారు 60 శాతం మంది ఉంటే, మిగిలిన 40 శాతం మంది కొత్త విమాన ప్రయాణికులే. న్యూఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి, వారణాసి, వైజాగ్‌కు గతంలో రూ.5వేల నుంచి రూ.15వేల పైబడి ఉండే టికెట్ ధరలు ప్రస్తుతం (నెలరోజుల ముందుగా బుక్ చేసుకుంటే) రూ.1,200 నుంచి రూ.5వేలకే అందుబాటులోకి వచ్చాయి. దీనికి తగ్గట్టుగా 2003లో ఒక్క హైదరాబాద్‌తో ప్రారంభమైన విమాన సర్వీసుల సంఖ్య ప్రస్తుతం 36కు చేరింది. దీనికితోడు ఈ ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించడంతో మరో ఆరు నెలల్లో ఇంటర్నేషనల్ విమాన సర్వీసులు కూడా ప్రారంభంకానున్నాయి.

ఆ అంటే.. ఆఫర్లు


ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో పెంచుకునేందుకు, కొత్త ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ఇటీవల విమాన సంస్థలు బంపర్ ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటిస్తున్నాయి. ఇటీవల ఎయిరిండియా ఇచ్చిన మాన్‌సూన్ ఆఫర్ కింద హైదరాబాద్‌కు రూ.1,200 టికెట్ ధర ప్రకటించడంతో ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించింది.

- చౌకధరల విమాన సంస్థ స్పైస్‌జెట్ తరచూ ఆఫర్లు ప్రకటిస్తూ ప్రయాణికులకు మరింత చేరువవుతోంది. హైదరాబాద్, చెన్నై, హైదరాబాద్ రూట్లలో ప్రయాణించే వారికి మెగా మాన్‌సూన్ ఆఫర్ కింద రూ.1,200 నుంచి రూ.1,600కు విమాన ప్రయాణ సదుపాయం కల్పిస్తోంది. అంతేకాకుండా విమాన ప్రయాణికులకు హోటల్స్ బుకింగ్‌పై 50 శాతం వరకు అదనపు డిస్కౌంట్లు కూడా ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆఫర్ ముగిసినా దేశీయంగా నడిపే సర్వీసుల టికెట్లపై 35 శాతం వరకూ డిస్కౌంట్ ప్రకటించింది.
- ప్రాంతీయ విమాన సంస్థ ట్రూజెట్ భారీ ఆఫర్లు ప్రకటిస్తూ ప్రయాణికుల సంఖ్యను పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది.
- ఆన్‌లైన్ ట్రావెల్స్ బుకింగ్ సంస్థలు కూడా విమాన టికెట్లపై పది నుంచి 50 శాతం వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి.



కల నెరవేరింది

సాధారణ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మాకు ఎప్పటి నుంచో విమాన ప్రయాణం చేయాలని కోరిక. ఇటీవల ఎయిరిండియా సంస్థ ప్రకటించిన విమాన ప్రయాణ ఆఫర్ కారణంగా మా కల నెరవేరింది. ఒక్కో టికెట్ ధర కేవలం రూ. 1,300లే కావడంతో మా కుటుంబంతో పాటు మరో 10 మంది బంధువులం కలిసి హైదరాబాద్ వెళ్లాం. కేవలం 45 నిమిషాలకే హైదరాబాద్‌ను చేరుకోవడంతో పాటు విమాన ప్రయాణం కొత్త అనుభూతిని కలిగించింది. – ఆకునూరి ధనలక్ష్మి, బంధువర్గం, దావాజీగూడెం



ఖర్చు తక్కువ.. సమయం ఆదా

మధ్యతరగతి వర్గానికి చెందిన నేను విమానంలో ప్రయాణించాలని ఎప్పటి నుంచో అనుకునేవాడిని. మా స్నేహితుల సహకారంతో ప్రయాణానికి రెండు నెలల ముందే అన్ని వెబ్‌సైట్‌లు పరీక్షించి హైదరాబాద్ నుంచి గోవాకు ఒక్కో టికెట్‌ను రూ.2వేలకు కొనుగోలు చేశాను. గోవా వెళ్లడానికి ఏసీ రైలైనా అంతే ఖర్చవుతుంది. దాంతో పాటు అతి తక్కువ సమయంలోనే గోవా చేరుకుని సరదాగా ఎంజాయ్ చేశాం.
- అంగిరేకుల రాంబాబు, విజయవాడ

– మధురానగర్ (విజయవాడ సెంట్రల్)

■ నగరంలో హీరోయిన్ పూజాహెగ్డే సందడి
■ ఏలూరురోడ్డులో అతిపెద్ద తొమ్మిదో లాట్ మొబైల్ షోరూమ్ ప్రారంభం



అభిమానం

అభిమానులతో కలిసి సెల్ఫీ దిగుతున్న హీరోయిన్ పూజాహెగ్డే

పూజయామి

పూల కళ్ల పూజాహెగ్డే శనివారం విజయవాడలో సందడి చేసింది. సూర్యారావుపేట ఏలూరురోడ్డులో ఏర్పాటు చేసిన దేశంలోనే ప్రముఖ స్మార్ట్ మొబైల్స్ రిటైల్ దిగ్గజం లాట్ మొబైల్ 127వ షోరూమ్ ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసింది. షోరూమ్ ప్రారంభోత్సవం ఈ సందర్భంగా పూజాహెగ్డే మాట్లాడుతూ ఐదో వార్షికోత్సవానికి విజయవాడలో అతిపెద్ద తొమ్మిదో లాట్ షోరూమ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వార్షికోత్సవ ఆఫర్లు వినియోగదారులకు అందుబాటు ధరల్లో ఆకర్షణీయంగా ఉన్నాయని, లక్కీ డ్రాలో రూ.5కోట్ల విలువైన బహుమతులు గెలుచుకోవచ్చన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దక్షిణ భారతదేశపు మొబైల్ రిటైల్ వ్యాపార సామ్రాజ్యంలోనే తమ లాట్ మొబైల్ సంచలనం సృష్టించిందని, షోరూమ్‌లన్నింటినీ అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటుచేశామన్నారు. నూతనంగా ప్రారంభించిన ఈ షోరూమ్‌ను ఆధునిక సదుపాయాలతో తీర్చిదిద్ది అన్ని బ్రాండెడ్ మొబైల్స్, లైవ్ డెమోలు, లేటెస్ట్ యాక్ససరీస్‌ను వినియోగదారులకు అందుబాటులో ఉంచామని వివరించారు. షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి కస్టమర్‌కు మొబైల్ కొనుగోలుపై డిస్కౌంట్‌తో పాటు కచ్చితమైన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్లు, పాల్గొన్నారు. – సూర్యారావుపేట (విజయవాడ సెంట్రల్)



గిఫ్ట్ ఆఫర్స్‌ను వివరిస్తున్న పూజ. చిత్రంలో సంస్థ ప్రతినిధులు

photo of the day

వెడలెను కోదండపాణి



రావణ సంహారానంతరం లంక నుంచి అయోధ్యకు పయనమైన సీతారామలక్ష్మణులను సముద్రం దాటించేందుకు హనుమ సిద్ధమవుతున్నట్టుగా ఉంది కదూ ఈ చిత్రం. ముద్దూరు ఇసుక ర్యాంప్ వద్ద కృష్ణానదిలో నీరు తగ్గడంతో ఎప్పుడో శ్రీరామనవమికి నిమజ్జనం చేసిన విగ్రహాలు ఇదిగో ఇలా బయటపడ్డాయి. ఫొటో : విజయకృష్ణ, విజయవాడ